




# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

ఖమ్మం
భద్రాద్రి
కొత్తగూడెం

శనివారం 10, జనవరి, 2026




# రైతు సంక్షేమమే ప్రభుత్వ కేంద్ర బిందువు

- టెక్నాలజీతో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే లక్ష్యం
- ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- రైతు మేళా వేదికగా పాలనా స్పష్టత
- గోదావరి జలాలు, మద్దతు ధర, యంత్ర సబ్సిడీలపై స్పష్టమైన హామీలు



అశ్వారావుపేటఆర్‌సి, సూర్య (మేజర్ న్యూస్)- అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల వేదికగా నిర్వహించిన రైతు మేళా కాంగ్రెస్ ప్రభుత్వ వ్యవసాయ విధానాలకు బలమైన వేదికగా నిలిచింది. రైతులను ఆధునిక సాంకేతిక వ్యవసాయం వైపు మళ్లించాలన్న స్పష్టమైన లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహించబడింది.ఈ సందర్భంగా ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తనను ఈ కార్యక్రమానికి ఆహ్వానించిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. రైతు సంక్షమమే ప్రభుత్వ కేంద్ర బిందువని, టెక్నాలజీతో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే లక్ష్యమని స్పష్టం చేశారు.

2లో



# ఏజెన్సీలో జాతీయ కబడ్డీ పోటీలు భేష్






మణుగూరు ఆర్ సి/పినపాక, సూర్య (మేజర్ న్యూస్)- ఏజెన్సీ ప్రాంతమైన ఏడూళ్ల బయ్యారంలో జాతీయస్థాయి కబడ్డీ పోటీల నిర్వహణ భేష్ అని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో జరుగుతున్న అండర్-17 జాతీయ స్థాయి బాలుర కబడ్డీ పోటీలను తిలకించేందుకు ప్రత్యేకంగా బయ్యారం వచ్చారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతిభావంతులైన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొని తమ నైపుణ్యాన్ని ప్రదర్శిశించాలన్నారు.

- కబడ్డీ పోటీలతో జిల్లాకు ప్రత్యేక గుర్తింపు
- క్రీడలతోనే మానసిక ఉల్లాసం
- కబడ్డీ ఆడి జోష్ నింపిన మంత్రి పొంగులేటి
- కబడ్డీ పోటీలను ఏర్పాటు చేసిన కంది ఫ్యామిలీని అభినందించిన మంత్రి




# రవాణా మాస ఉత్సవాల సందర్భంగా అవగాహన ర్యాలీ



రవాణా మాసోత్సవాలు లో-డిటిఓ జగదీష్, ఆర్టీఏ బోర్డు గజ్జెల్లి వెంకన్న, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ స్వర్ణలత

ఖమ్మం ,సూర్య బ్యూరో : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రవాణా మాసోత్సవాలు సందర్భంగా ఖమ్మం జిల్లా రవాణా శాఖ కార్యాలయం నుండి కొత్త మున్సిపాలిటీ వరకు పాదయాత్రగా వెళ్తూ వాహనదారులకు నినాదాలు ఇస్తూ ప్రజలకు హెల్మెట్ ధరించి, సీటు బెల్టు పెట్టుకోవాలని ,మైనర్లకి వాహనాలు ఇవ్వరాదని, అతివేగంగా వాహనాలు నడప రాదని ర్యాలీ నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమంలో ఆర్టిఏ ఏవో సుధాకర్ ,స్టాఫ్ సీనియర్ అసిస్టెంట్ రత్నరాజు, సీతారాములు , విజయలక్ష , కానిస్టేబుల్ రమేష్ , సరిత , ప్రసన్న, నీచాలా ,ట్రాన్స్పోర్ట్ యూనియన్ నాయకులు జిల్లా ఉపేందర్ , కార్ డ్రైవింగ్ స్కూల్ అసోసియేషన్ నాయకులు మస్తాన్, మధు , ట్రాక్టర్స్ డ్రైవర్స్ యూనియన్ నాయకులు రాందాస్, ఆటో యూనియన్ నాయకులు లక్ష్మణ్ ,ఉపేందర్, భాస్కర్ నాయకులు పాల్గొన్నారు .



# కారును ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

పెనుబల్లి సూర్య మేజర్ న్యూస్...

పెనుబల్లి మండలం టేకులపల్లి వద్ద ఆర్టీసీ బస్సు కారు ఢీకొట్టడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ఖమ్మం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు రాజమండ్రి నుండి ఖమ్మం వెళ్తుండగా పెనుబల్లి మండలం టేకులపల్లి గ్రామ శివారులో ఖమ్మం వైపు నుండి బియ్యం మందిరం వైపు వెళ్తున్న కారుని ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు, కారులోని వారికి స్వల్ప గాయాలయ్యాయి. ఎవరికీ ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

# రైతు సంక్షమమే ప్రభుత్వ కేంద్ర బిందువు






మొదటి పేజీ తరువాయి

రైతులు సరికొత్త వ్యవసాయ యంత్రాలు, పరికరాలను వినియోగించి ఉత్పాదకత పెంచుకునేలా జిల్లా అధికారులు చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో విధానాలు అమలవుతున్నాయనేందుకు ఇదే నిదర్శనమన్నారు.

### 50% సబ్సిడీతో యంత్రాలు -- రైతుకు బలమైన భరోసా

రైతులకు ట్రాక్టర్లు, వ్యవసాయ యంత్రాలు 50 శాతం సబ్సిడీతో అందిస్తున్న ఘనత పూర్తిగా కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. యంత్రాల వల్ల సాగు ఖర్చులు తగ్గి, దిగుబడులు పెరుగుతున్నాయని పేర్కొన్నారు.

### దేశంలోనే వరి సాగులో తెలంగాణ అగ్రస్థానం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే వరి పంట సాగులో అగ్రస్థానంలో నిలిచిందని తెలిపారు. ఇది రైతు అనుకూల పాలనకు నిదర్శనమని అన్నారు.తాను ఇరిగేషన్ మంత్రిగా, తుమ్మల నాగేశ్వరరావు వ్యవసాయ మంత్రిగా ఉన్న సమయంలోనే రాష్ట్రం 70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి చేసిన ఘనత సాధించిందని గుర్తుచేశారు.

### 48 గంటల్లో మద్దతు ధరౌ బోనస్‌తో పాటు

వరి పండించిన రైతులకు మద్దతు ధరను 48 గంటల్లోనే ఖాతాల్లో జమ చేయడమే కాకుండా బోనస్ కూడా అందిస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. రైతు చెమటకు విలువ కట్టే పాలన ఇదేనని వ్యాఖ్యానించారు.

### గోదావరి జలాలు - హామీ కాదు అమలు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతే సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు అందుతున్నాయని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం ప్రకటనలకే పరిమితమైతే, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టును పూర్తి చేసి నీళ్లు విడుదల చేసిందని స్పష్టం చేశారు.నూటికి నూరు శాతం గోదావరి జలాలను ఉమ్మడి ఖమ్మం జిల్లాకు అందిస్తామని హామీ ఇచ్చారు.

### కాళేశ్వరం కూలిపోయింది కమీషన్ల రాజకీయంతోనే!

వేల కోట్లు ఖర్చు పెట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోవడానికి కారణం నాసిరక నిర్మాణాలు, కమీషన్ల దాహమేనని తీవ్రంగా విమర్శించారు. ప్రజాధనం దుర్వినియోగానికి ఇదే ప్రత్యక్ష ఉదాహరణన్నారు.

### సీతారామ సీతమ్మ సాగర్ పూర్తి చేస్తాం

సీతారామ ప్రాజెక్టును పూర్తిస్థాయిలో అమలు చేయడంతో పాటు, సీతమ్మ సాగర్ ప్రాజెక్టుకు అడ్డుగా నిలిచిన పరిపాలనా అనుమతులను సాధించి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సాగునీటి సమస్యలు శాశ్వతంగా పరిష్కారమవుతాయని ధీమా వ్యక్తం చేశారు.ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతుల జీవితాశయంగా భావిస్తున్న సీతారామ ప్రాజెక్టు పనులు వేగవంతం చేయడమే లక్ష్యంగా ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని అశ్వారావుపేటకు ఆహ్వానించినట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ప్రాజెక్టు నిర్మాణం ఉధృతంగా కొనసాగేందుకు ఇరిగేషన్ మంత్రి ప్రత్యక్ష పర్యవేక్షణ అవసరమని పేర్కొన్నారు.మంత్రి ఉత్తమ్ నియోజకవర్గంలో త్వరలో ఏర్పాటు కానున్న వ్యవసాయ కళాశాల దృష్ట్యా, అశ్వారావుపేటలో ఇప్పటికే ఉన్న వ్యవసాయ కళాశాలను సందర్శిస్తే ఉపయోగకరంగా ఉంటుందనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమానికి ఆహ్వానించామని తెలిపారు.

### సీతారామ నా కలల ప్రాజెక్టు

సీతారామ ప్రాజెక్టు తన కలల ప్రాజెక్టు అని పేర్కొంటూ, పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని మంత్రిగారిని ప్రాజెక్ట్ పనుల పర్యవేక్షణకు ప్రత్యేకంగా ఆహ్వానించినట్లు చెప్పారు. త్వరలోనే ప్రాజెక్టును పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.ఉమ్మడి ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలను అందించే ప్రక్రియను పూర్తి చేయడమే తన జీవిత ఆశయమని వ్యాఖ్యానించారు.

### దేశానికే ఆదర్శంగా అశ్వారావుపేట రైతులు

దేశంలో ఏ రైతూ సాగు చేయలేని విధంగా అశ్వారావుపేట రైతులు విభిన్న రకాల పంటలు సాగు చేస్తున్నారని ప్రశంసించారు. ప్రధాన పంటలతో పాటు అంతర పంటలుగా వక్క, కోకో, జాజి వంటి పంటలను సాగుచేస్తూ ఆదాయాన్ని పెంచుకుంటున్నారని తెలిపారు.ఇది రైతుల కృషికి, ప్రాంతపు భూమి సామర్థ్యానికి నిదర్శనమన్నారు.

### రైతులు పచ్చగా ఉంటేనే ప్రభుత్వం పచ్చగా ఉంటుంది

రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరలు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు.రైతులు పచ్చగా ఉంటేనే ప్రభుత్వాలు పచ్చగా ఉంటాయి అనే స్పష్టమైన విధానంతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.

### ప్రకృతి వ్యవసాయం, ఆయిల్ పామ్‌లో తెలంగాణ ముందంజ

దేశంలోనే ప్రకృతి వ్యవసాయం, ఆయిల్ పామ్ సాగు వంటి రంగాల్లో తెలంగాణ రాష్ట్రం ముందుండేలా కృషి చేస్తున్నామని తెలిపారు. రైతుల ఆదాయం పెరిగేలా కొత్త సాగు విధానాలను ప్రోత్సహిస్తున్నామని స్పష్టం చేశారు.

### రేవంత్ రెడ్డి పాలనలో వ్యవసాయంలో తెలంగాణ నం.1 లక్ష్యం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం వ్యవసాయ రంగంలో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచేలా కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నామని తెలిపారు. సాగునీరు, సాంకేతికత, మద్దతు ధరలు మూడు స్తంభాలపై వ్యవసాయ అభివృద్ధి సాగుతోందన్నారు.

# ఏజెన్సీలో జాతీయ కబడ్డీ పోటీలు భేష్

మొదటి పేజీ తరువాయి




క్రీడా మైదానాన్ని పరిశీలించిన మంత్రి, కబడ్డీ మ్యాచ్‌లను ఆసక్తిగా వీక్షంచారు. అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కొద్దిసేపు కబడ్డీ ఆట ఆడి జోష్ నింపారు.క్రీడలు శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా మానసిక ఉల్లాసాన్ని పెంచుతాయని అన్నారు.నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ముందుండాలని సూచించారు. క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సహనం వంటి గుణాలు క్రీడల ద్వారా అలవడతాయని, అవే భవిష్యత్‌లో జీవిత విజయానికి బాటలు వేస్తాయని తెలిపారు.ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని, గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా జాతీయ, అంతర్జాతీయ స్థాయికి క్రీడాకారులు ఎదగేలా మౌలిక వసతులు కల్పిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.ఈ బయ్యారం లాంటి గ్రామీణ ప్రాంతంలో జాతీయ స్థాయి పోటీలు జరగడం స్థానిక యువతకు ప్రేరణగా నిలుస్తుందని అన్నారు. ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకొని క్రీడాకారులు రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షంచారు.ఈ కార్యక్రమంలో ఎంపీ బలరాం నాయక్ మాట్లాడుతూ క్రీడలు యువతను తప్పుదారి నుంచి దూరంగా ఉంచి ఆరోగ్యకరమైన జీవనశైలికి అలవాటు చేస్తాయని తెలిపారు.పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తమ నియోజకవర్గంలో జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించుకోవడం గర్వకారణమని చెప్పారు.జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ పోటీలు సజావుగా జరిగేలా అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట, జిల్లా విద్యాశాఖాధికారి నాగలక్ష్ములు మాట్లాడుతూ క్రీడాకారులకు అవసరమైన వసతులు కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు,తుళ్లూరు బ్రహ్మయ్య,ఎస్జిఎఫ్ జిల్లా కార్యదర్శి నరేష్,పి డి వీరన్న కంది చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంది సుబ్బారెడ్డి, కంది విశ్వ భరత్ రెడ్డి, పినపాక తహసిల్దార్ గోపాలకృష్ణ, ఎంపీడీవో సంకీర్త్, ఎంపీఓ వెంకటేశ్వర్లు,వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.మణుగూరు డిఎస్పీ వంగ రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో మణుగూరు,ఈ. బయ్యారం సిఐలు పి.నాగబాబు, కె.వెంకటేశ్వరరావు, ఎస్సైలు నగేష్, సురేష్ ల నేతృత్వంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# ఇన్ సర్వీస్ టీచర్ల టెట్,సిపిఎస్ నురద్దుచేయాలి



**టేకులపల్లి, సూర్య (మేజర్ న్యూస్) -** టేకులపల్లి టిపిటిఎఫ్ మండలశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాల గంగారంలో ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు నిర్వహించే ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ ను రద్దు చేయాలని,సిపిఎస్ ను రద్దుచేసి ఓపిఎస్ ను పునరుద్ధరించాలని,న్యూ ఎడ్యుకేషన్ పాలసీ-2020 ను రద్దు చేయాలని,టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలలో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు ఓటు హక్కు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయులు శుక్రవారం నిరసన తెలిపారు. టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు గుగులోత్ హరిలాల్ నాయక్ మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా సర్వీసు చేసిన ఉపాధ్యాయులకు ,ఇప్పుడు ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ రాసి, రెండు సంవత్సరాలలో ఉత్తీర్ణులు కావాలని ,లేని యెడల ఉద్యోగం నుండి తొలగిస్తామని ,చెప్పడం సరైనది కాదని,ఉద్యోగ నియామక నోటిఫికేషన్లలో పేర్కొన్న విద్యార్హతల ప్రకారమే ,ఉద్యోగాలు పొందినప్పటికీ, ఇప్పుడు కొత్తగా టెట్ పరీక్ష రాయాలని,లేనియెడల ఉద్యోగం నుండి తొలగిస్తామని చెప్పడం సరైనది కాదని,ఇటువంటి నిర్ణయాలను వెంటనే విరమించుకోవాలన్నారు. విద్యా హక్కు చట్టం 2009కి తరువాత నియమించబడిన, ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయించాలని,అందుకు తగినట్టుగా విద్య హక్కు చట్టాన్ని, అమెండ్మెంట్ చేయాలని కోరారు.ఉద్యోగ ఉపాధ్యాయులకు నష్టం కలిగించే సిపిఎస్ ను రద్దు చేసి ,ఓపిఎస్ ను పునరుద్ధరించాలని, న్యూ ఎడ్యుకేషన్ పాలసీ 2020 రద్దు చేయాలన్నారు.ప్రస్తుతం ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరూ ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నందున, అందరికీ టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటు హక్కు కల్పించాలన్నారు.పై డిమాండ్ల సాధన కొరకు నేడుఉపాధ్యాయులందరము ఈ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మెమొరాండాన్ని రాష్ట్రపతి,ప్రధానమంత్రికి సమర్పిస్తామని,అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఈ డిమాండ్లను పరిష్కరించకపోతే ఫిబ్రవరి 5న జరగబోయే చలో ఢిల్లీ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనబోతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిపిటిఎఫ్ మండలం ప్రధాన కార్యదర్శి పూనెం సమ్మయ్య,మండల కార్యదర్శి జి.నందా, ప్రధానోపాధ్యాయులు డి.జగన్, ఉపాధ్యాయులు టి.రామారావు బి.వాల్యా నాయక్, బుగ్గ వెంకటేశ్వర్లు, ఏ.కిషన్,బి.కస్నా నాయక్, ఎం.శ్రీనివాసరావు, డి.వీరన్న, కె.ఎర్రయ్య, టి.బిక్షమయ్య, ఎం.రాంబాబు, బి.వీరన్న, కె.రమేష్, బి.శ్రీవాణి, జి.బిచ్యా, గోపాలీలలు, జానయ్య పాల్గొన్నారు.

# మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డిని కలిసిన అక్షర మహిళా మండలి

**మణుగూరు ఆర్ సి/ పినపాక,సూర్య (మేజర్ న్యూస్)-** నియోజకవర్గంలోని ఏడుల్ల బయ్యారం మండలంలో జరుగుతున్న అండర్ 17 కబడ్డీ క్రీడా కార్యక్రమాల్లో భాగంగా క్రీడాకారులని ప్రోత్సహించడానికి వచ్చిన తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ వ్యవసాయ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డిని రేణుక అక్షర మహిళా మండలి సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో రేణుక అక్షర మహిళా మండలి సభ్యులు కోరి శ్యామల, కన్నాపురం వసంత, సౌజన్య డాకూరి, రెడ్డి బోయిన రేణుక, కన్నాపురం శైలజ తదితరులు పాల్గొన్నారు.



సూర్య

www.suryaa.com

శనివారం 10, జనవరి, 2026

# పర్యావరణ పరిరక్షణ కోసం గ్రీన్ భద్రాద్రి చేస్తున్నసేవలు మరువలేనివి

**శ్రీ శ్రీ శ్రీ దేవనాధ రామానూజ జీయర్ స్వామి..**





**భద్రాచలం ఆర్‌సి,సూర్య (మేజర్ న్యూస్)-** భద్రాచలంలోని కోమల పాఠశాల, లిటిల్ ఫ్లవర్స్ స్కూల్ లో,ఎమ్మెస్సార్ పబ్లిక్ స్కూల్, సారపాకలో గ్రీన్ భద్రాద్రి మరియు శ్రీ జీయర్ మఠం వికాసతరంగిణి వారి సంయుక్త ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ దేవనాథ రామానుజ జీయర్ స్వామి చిన్నారులకి మంగళాశాసనాలు అందించి, మొక్కలు నాటారు. కాలుష్యాన్ని అరికట్టి, భూతాపాన్ని తగ్గించి, పర్యావరణ పరిరక్షణ చేయవలసిన బాధ్యత అందరిపై ఉందని, ముఖ్యంగా చిన్నారులు సైతం పర్యావరణ హితం కోసం విరివిగా మొక్కలు నాటాలని, పర్యావరణ పరిరక్షణ కోసం గ్రీన్ భద్రాద్రి చేస్తున్న సేవలు మరువలేనివని స్వామి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రీన్ భద్రాద్రి అధ్యక్షురాలు చిట్టే లలిత, పాఠశాలల కరెస్పాండెంట్లు మాగంటి సాయి సూర్య, మాగంటి శారద, పి. రవి కుమార్, శశిధర్ రెడ్డి, జీయర్ మఠం, భద్రాచలం అధ్యక్షులు జి.వెంకటాచారి, ఎన్.సి.హెచ్. చక్రవర్తి, గ్రీన్ భద్రాద్రి కో ఆర్డినేటర్ లాయర్ తిరుమలరావు, వికాస తరంగిణి, కార్యకర్తలు పి.లలిత, రాజ్యలక్ష్మ, వాసవి,చైతన్య లక్ష్మ, విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు





**పాల్వంచ,సూర్య (మేజర్ న్యూస్)-** కుమారులు లేకపోవడంతో ఇంటికి పెద్ద కూతురే అన్నీ తానై తండ్రి చనిపోతే తలకొరివి పెట్టి తండ్రి రుణాన్ని తీర్చుకుంది. ఈ విషాద సంఘటన పాల్వంచ పట్టణంలోని వడ్డుగూడెంలో (గొల్లగూడెం)శుక్రవారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి వివరాల ప్రకారం..వడ్డుగూడెం లో నివసిస్తున్న ముదిగొండ కోటేశ్వరరావు అనే వ్యక్తి చంద్రుగొండ మండలం మద్దుకూరులో వెటర్నరీ అసిస్టెంట్ గా పని చేస్తున్నారు. అకస్మాత్తుగా గుండె పోటు రావడంతో ఆయన బుధవారం తెల్లవారుజామున మృతిచెందారు.మృతునికి ఇద్దరు కుమార్తెలు పెద్ద కూతురు నవ్య, చిన్న కూతురు అస్మిత లు ఉన్నారు. పెద్ద కూతురు కెనడాలో భర్తతో కలిసి సాఫ్ట్వేర్ ఇంజనీరుగా పనిచేస్తుండగా తండ్రి మృతి చెందిన విషయం తెలిసిన వెంటనే అక్కడి నుంచి విమానంలో శుక్రవారం ఉదయం పాల్వంచలో నీ తండ్రి ఇంటికి చేరుకుంది. మృతునికి కొడుకులు లేకపోవడంతో పెద్ద కుమార్తె నవ్య తండ్రికి తలకొరివిపెట్టి కన్నతండ్రి రుణాన్ని తీర్చుకుంది.ఈ సంఘటనను చూసిన బంధువులు, మిత్రులు, అతని కొలీగ్స్, శ్రేయోభిలాషులంతాకన్నీటి పర్యంతం అయ్యారు.

# స్టార్ చిల్డ్రన్ హైస్కూల్‌లో సంక్రాంతి ముగ్గుల పోటీలు



**పాల్వంచ,సూర్య(మేజర్ న్యూస్)-** స్థానిక మార్కెట్ ఏరియాలో గల స్టార్ చిల్డ్రన్ హైస్కూల్‌లో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని విద్యార్థినులకు ముగ్గుల పోటీలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ పోటీలలో పాల్గొన్న విద్యార్థినిలు తెలుగువారి సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించేలా ఆకర్షణీయ మైన రంగురంగుల రంగవల్లులను వేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ జి. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి పండుగ తెలుగు వారి సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అని నేటి తరం విద్యార్థులకు విద్యతో పాటు భారతీయ సంస్కృతి సాంప్రదాయాలను గూర్చి కూడా తెలియజేయాలన్నారు. తెలుగువారి సిరిసంపదలకు చిహ్నమైన ముగ్గులు కేవలం ఒక కళ మాత్రమే కాదని, అది క్రమశిక్షణకు ఏకాగ్రతకు సృజనాత్మకతకు నిదర్శనమని విద్యార్థినులను అభినందించారు. పోటీలో విజేతలైన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు స్వరూప, రమాదేవి, మహేశ్వరి, ప్రశాంతి, ఝాన్సీ, అనూష, మాధవి, గీత, లక్ష్మ, స్వాతి, సుల్తానా, భవాని, విద్యార్థులు, తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షమానికి సమప్రాధాన్యతనిస్తున్నాం







**పేదల ఆర్థికభారాన్ని మోయడం అభినందనీయం**

**కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**

**రూ.22.20కోట్ల సంక్షమ పథకాల చెక్కులు అందించిన కూనంనేని**

**కొత్తగూడెం,సూర్య (మేజర్‌న్యూస్) -** పేదవర్గాలకు మునుపెన్నడూ లేనివిధంగా పెద్దమొత్తంలో సంక్షమ పథకా డబ్బులు మంజూరు కావడంతో కొత్తగూడెం నియోజకవరంలో సంక్షమ సంబురం నెలకొంది. కల్యాణలక్ష్మ-షాదీ ముబారక్ పథకంలో 201మంది లబ్దిదారులకు మంజూరైన రూ.2.12కోట్ల విలువైన చెక్కులు, అదేవిధంగా చీఫ్ మినిష్టర్ రిలీఫ్ ఫండ్ పథకంలో 50 మందికి మంజూరైన రూ.20.70లక్షల విలువైన చెక్కులను కొత్తగూడెం క్లబ్బులు జరిగిన కార్యక్రమంలో శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కూనంనేని మాట్లాడుతూ కొత్తగూడెం నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు, ప్రజాసంక్షమ పథకాలకు సమప్రాధాన్యత నిస్తుంన్నామని, పార్టీలకతీతంగా ప్రతిపేదకుటుంబానికి సంక్షమపథకాలు, అభివృద్ధిఫలాలు అందిస్తున్నామన్నారు. పేదకుటుంబాల ఆర్థికాభిరాన్ని తీర్చేందుకు ప్రభుత్వం సంక్షమపథకాలు ప్రవేశపెట్టి పకడ్బందీగా అమలుచేయడం అభినందనీయమన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షమపథకాలు చేరవేయడమే తన బాధ్యతని, ముఖ్యంగా ఆడబిడ్డల పెళ్లిళ్లకు కల్యాణ లక్ష్మ పథకం ఆర్థిక భరోసానిస్తుండగా, ఆపద సమయంలో వైద్య ఖర్చుల కోసం సీఎం రిలీఫ్ ఫండ్ అండగా నిలుస్తోందని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హమాలను పూర్తిస్థాయిలో అమలుచేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవడం ద్వారా ప్రభుత్వంపై ప్రజలకు పూర్తినమ్మకాన్ని కలిగించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిరంతరం ప్రజల మధ్య ఉంటూ, నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సౌరబ్ శర్మ, సిపిఐ జిల్లా కార్యదర్శి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఎస్ కె సాబీర్ పాషా, డిప్యూటీ కలెక్టర్ పానెం కృష్ణ, తహసీల్దార్లు వనం కృష్ణ ప్రసాద్, తహసీల్దార్ దారా ప్రసాద్, సర్పంచులు, మాజీ మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

# ఎర్రగుంట పాఠశాలలో ముగ్గుల పోటీలు



**పాల్వంచ,సూర్య (మేజర్‌న్యూస్) -** పాల్వంచ పట్టణంలోని పచ్చని పొలాలు రంగురంగుల పువ్వుల మధ్య విలసిల్లిన్న ఎంపీ యుపిఎస్ ఎర్రగుంట పాఠశాలలో ఈనెల 8వ తేదీన పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు.ఆ పోటీలలో విద్యార్థినీ విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో పాల్గొని తమ ప్రతిభను వెలికి తీశారు. ఈ పోటీలకు ప్రముఖ దంత వైద్య నిపుణురాలు డాక్టర్ సుగుణ, డి.సుజాత న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ప్రత్యేక అతిథిగా కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు పద్మలత విచ్చేశారు. విద్యార్థులందరూ రంగురంగుల రంగవల్లులతో పాఠశాల ప్రాంగణాన్ని నింపేశారు. మహిళా శక్తికి ప్రతిబింబంలా దీపంతో ఉన్న యువతి సంక్రాంతి సంబరాలలో భాగంగా హరిదాసు గంగిరెద్దు మేళం చెరుకు గడలు భోగి కుండలు ఇలా ఒకటేమిటి రకరకాల రకరకాల రూపాలతో చుక్కలు మెలికల ముగ్గులతో ప్రాంగణమంతా ఒక్కసారిగా రంగులతో నిండిపోయింది. ఈ సందర్భంగా న్యాయనిర్నేతలు డాక్టర్ సుగుణ మాట్లాడుతూ ఈ పాఠశాల కార్పొరేట్ పాఠశాలకు దీటుగా విద్యార్థులు చాలా క్రమశిక్షణతో ప్రతిభా పాటవాలతో ఉన్నారని కొనియాడారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు పద్మలత తమ చిన్ననాటి రోజులు గుర్తుకు వస్తున్నాయని పిల్లల ప్రతిభ ప్రశంసనీయమని చెప్పారు. దాదాపు 60 మంది వరకు పోటీ చేసినటువంటి పోటీలో విజేతలకు మొదటి మూడు బహుమతులతో పాటు పాటు ప్రోత్సాహక బహుమతులు కూడా ఇవ్వబడ్డాయి.

# తానం రవీందర్ ఆశయాలు సాధించాలి



**ములకలపల్లి, సూర్య (మేజర్ న్యూస్)-** సిపిఎం మాజీ మండల కార్యదర్శి స్వర్గీయ తానం రవీందర్ ఆశయాలు సాధించాలని సిపిఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం రవీందర్ 5 వ వర్ధంతి సందర్భంగా స్మారక స్తూపం వద్ద జరిగిన వర్ధంతి సభలో మాట్లాడుతూ రవీందర్ మండలం లో ఉన్న పీడిత ప్రజల తరుపున వారిసమస్యలు పరిష్కారం కోసం అనేక ప్రజాఉద్యమాలు నిర్వహించారని తెలిపారు. ముఖ్యంగా ఆనాటి ప్రభుత్వం పోడు సాగుదారులపై కక్ష్య పురితంగా వ్యవహారిస్తూ భూములు గుంజుకోవాలని చూసిన సమయాన వారితరుపున అండగా ఉండి పేదల భూములను కాపాడినారని ఈ సందర్భంగా పలుమార్లు నెలల తరబడి జైలు జీవితం గడిపారన్నారు. ఇదే కాక అనేక సందర్భాలలో పేదలకు కష్టం వస్తే నేనున్నానని అండగా ఉండేవారన్నారు. రవీందర్ లేకపోవడం ప్రజాఉద్యమాలకు తీరనిలోటని, పీడిత ప్రజల సమస్యలు పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహించడమే అయనకి ఇచ్చే ఘణమైన నివాళి అన్నారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు గౌరి నాగేశ్వరావు, నిమ్మల మధు, కుంజా రామూర్తి, సారయ్య, శ్రీరాములు, కమలాపురం సర్పంచ్ వగ్గెల రాధ, వంశీ, గణప సాయిరాం,వెంకటమ్మ, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

# రామచంద్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రంగవల్లుల పోటీ



**లక్ష్మదేవిపల్లి,సూర్య (మేజర్ న్యూస్)-** మండలకేంద్రంలోని శ్రీరామచంద్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వనజ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని విద్యార్థినులకు శుక్రవారం రంగవల్లుల పోటీ నిర్వహించడం జరిగింది.పండుగ విశిష్టతను తెలిపే విధంగా వేసిన రంగవల్లులు ఆకట్టుకున్నాయి. ఆకర్షణీయమైన ముగ్గులు వేసిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కల్చరల్ కోఆర్డినేటర్ డాక్టర్ విద్యా ప్రవీణ,కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది,విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# త్రివేణిలో ముందస్తుగా సంక్రాంతి వేడుకలు





**లక్ష్మదేవిపల్లి, సూర్య (మేజర్ న్యూస్) –** స్థానిక లక్ష్మదేవిపల్లిలో గల త్రివేణి కిడ్స్ పాఠశాలలో ముందస్తుగా సంక్రాంతి వేడుకలు నాంది పలికాయి. చిన్నారులలో దాగిఉన్న సృజనాత్మకత, ఔత్సుకత ప్రేరణగా ముగ్గులపోటీలు నిర్వహించడమే కాకుండా సంక్రాంతి విశిష్ఠత గోచరించే విధంగా హరిదాసుల, సాంప్రదాయ వేషాధారణలో ప్రాంగణమంతా చిన్నారుల సంతోషాల కేరింతలతో ముస్తాబైంది. త్రివేణి పాఠశాలల డైరెక్టర్స్ గొల్లపూడి జగదీష్ సంక్రాంతి కాంతులు ప్రతి ఒక్కరి జీవితంలో వెల్లివిరియాలని ఆకాంక్షస్తూ చిన్నారులకు శుభాషిస్సులు అందించారు. ఈ కార్యక్రమంలో త్రివేణి పాఠశాలల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి, సి.ఆర్.ఓ. కాట్రగడ్డ మురళీ కృష్ణ, ప్రిన్సిపాల్స్ వి.సూర్యనారాయణ మూర్తి, శ్రీనివాస్ సింగ్, నేతాజీ, వైస్ ప్రిన్సిపాల్ సౌజన్య పాల్గొన్నారు.

# స్వామి వివేకానంద జయంతి వేడుకలకు ఆహ్వానం



**అన్నపురెడ్డిపల్లి, సూర్య (మేజర్ న్యూస్)–** స్వామి వివేకానంద 164 వ జయంతి వేడుకలకు మండల ప్రజలను ఆహ్వానం పలుకుతున్నామని హరిహర ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవాలయ పునర్నిర్మాణ వ్యవస్థాపకులు మారగాని శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఈనెల 12వ తేదీ సోమవారం ఉదయం 9 గంటలకు హరిహర ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యాశాఖ అధికారి బి నాగలక్ష్మి, విశిష్ట అతిథులుగా జూలూరుపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ డి శ్రీలక్ష్మి, అన్నపురెడ్డిపల్లి ఎంపీడీవో కావూరి మహాలక్ష్మి, తహశీల్దార్ గంటా ప్రతాప్ విచ్చేస్తున్నారని తెలిపారు. వేడుకల్లో పాల్గొన్న వారికి స్వామి వివేకానంద జీవిత చరిత్ర పుస్తకాలను వితరణ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# నర్సరీ పనులను ప్రారంభించిన సూరారం సర్పంచ్ జగన్నాథం



**జూలూరుపాడు, సూర్య(మేజర్ న్యూస్) –** మండలంలోని సూరారం గ్రామ పంచాయతీ పరిధిలో నర్సరీ పనులను గ్రామ సర్పంచ్ చింతా జగన్నాథం ప్రారంభించారు. నర్సరీ బ్యాగ్ ఫిల్లింగ్ ప్రారంభించిన అనంతరం జగన్నాథం మాట్లాడుతూ గ్రామంలోని సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ ముందుకు వెళుతున్నామని పేర్కొన్నారు. సూరారం గ్రామ పంచాయతీని ఆదర్శ గ్రామంగా తీర్చి దిద్దాలన్నదే తన సంకల్పమని సర్పంచ్ చింతా జగన్నాథం తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆదూరి హరిబాబు,ఫీల్డ్ అసిస్టెంట్ బి వీరభద్రం, పంచాయతీ సిబ్బంది, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

# వ్యవసాయ పొలాలకు వెళ్లే దారికి గ్రావెల్‌తో మరమ్మతులు

## రైతుల కొరకు సొంత నిధులులను వెచ్చించిన మాజీ ఎంపీటీసీ సతీష్

## హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామ రైతులు



**జూలూరుపాడు, సూర్య(మేజర్ న్యూస్) –** మండలంలోని కాకర్ల గ్రామంలో వ్యవసాయ రైతుల పొలాలకు వెళ్లే దారికి కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కాకర్ల మాజీ ఎంపీటీసీ పొన్నెకంటి సతీష్ కుమార్ గ్రావెల్ తొలించారు.సతీష్ తన సొంత నిధులను వెచ్చించి గుంతలు ఏర్పడిన దారిలో మరమ్మతు చేయించారు.రైతుల సంక్షమమే లక్ష్యంగా పనులు చేయిస్తూ కాకర్ల మాజీ ఎంపీటీసీ పలువురికి ఆదర్శంగా నిలిచారు.గ్రామ శివారు ఎర్రవాగు చెరువు పరిసర ప్రాంత వ్యవసాయ రైతాంగం పడుతున్న ఇబ్బందిని తన దృష్టికి తెచ్చారని సతీష్ కుమార్ పేర్కొన్నారు.సమస్యను సత్వరమే పరిష్కరించేందుకు ఎర్రవాగు చెరువు పొలాలకు వెళ్లే దారికి మరమ్మత్తులు చేయాలన్న దృఢ సంకల్పంతో గ్రావెల్ తొలకం పనులకు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించడం జరిగిందన్నారు.రైతుల సమస్యలే తన సమస్యగా భావించి ప్రభుత్వం నుంచి సహకారం ఆలస్యమైనా.. ప్రజాప్రతినిధిగా సమస్యను పరిష్కరించడం తన బాధ్యతని సతీష్ పేర్కొన్నారు. అధికారికంగా తాను ఏ పదవిలో లేకున్నా... గ్రామ పౌరిడిగా బాధ్యత తీసుకుని వ్యవసాయ పొలాలకు వెళ్లే దారి అభివృద్ధి పనులు చేపట్టానని పొన్నెకంటి సతీష్ కుమార్ వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు చెరుకుమల్లి నవీన్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించి పరిష్కారం చూపిన మాజీ ఎంపీటీసీ సతీష్ కుమార్ కు గ్రామ ప్రజల తరపున ధన్యవాదములు తెలిపారు.ఈ కార్యక్రమంలో జూలూరుపాడు మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు జిడుగు రాఘవ,సొబ్బని లాలయ్య, గ్రామ రైతులు కుంటి గొర్ల రాము, నాగరాజు,చిమట వెంకటేశ్వర్లు, కాలంగి రామ నరసయ్య, చిమట ముత్తయ్య, ఎరిదేశి వెంకటేష్, సాంబశివరావు, కంపసాటి వ ు ు ే క్త శ్వ ం రా వు , వెంకటనారాయణ, చిన్న కృష్ణయ్య, గోసు నరసింహారావు,చౌకాల చంటి, మధు, ఉదారి రాము, మద్దిబోయిన గోపాలరావు తదితరులు తెలిపారు.



# గనిని మూతపడనివ్వను







## సింగరేణితోనే మణుగూరు భవిష్యత్తు

## కార్మికులకు ఎలాంటి అన్యాయం జరిగినా గోడలా నిలుస్తా

## ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

**మణుగూరు ఆర్ సి,సూర్య(మేజర్ న్యూస్) –** సింగరేణితోనే మణుగూరు ప్రాంతానికి భవిష్యత్తు అని..కార్మికులకు ఎలాంటి అన్యాయం జరిగినా గోడలా నిలుస్తానని స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. శుక్రవారం పీకే ఓసి--2 సింగరేణి గని వద్ద నిర్వహించిన పిట్ మీటింగ్ లో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. సింగరేణి గనులు మూతపడితే అది కేవలం గని సమస్య కాదని వేలాది కార్మిక కుటుంబాల జీవన ప్రశ్న అని పేర్కొన్నారు. ఈ అంశాన్ని గత అసెంబ్లీ సమావేశాల్లోనే సంబంధిత శాఖ మంత్రులు, ఉన్నతాధికారుల దృష్టికి గట్టిగా తీసుకెళ్లినట్లు గుర్తు చేశారు. సింగరేణి గనుల రక్షణ కోసం ప్రభుత్వ స్థాయిలో నిరంతర చర్చలు కొనసాగుతున్నాయని, కార్మికుల భవిష్యత్తు, ప్రాంత ఆర్థిక స్థిరత్వాన్ని దృష్టిలో పెట్టుకుని సానుకూల నిర్ణయాలు త్వరలోనే తీసుకోనున్నామని ధీమా వ్యక్తం చేశారు. సింగరేణిపై ఆధారపడి జీవిస్తున్న వెయ్యి మంది కాంట్రాక్ట్ కార్మికులు, 1500 మంది ఓబీ వర్కర్లు జీవనాధారం కోల్పోతే మణుగూరు ప్రాంతమంతా తీవ్రమైన ఆర్థిక సంక్షభంలో పడే ప్రమాదం ఉందన్నారు. అందుకే ముందుచూపుతో సింగరేణి గని జీవితకాలాన్ని పొడిగించేందుకు అహర్నిశలు పోరాడుతానన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణే తన రాజకీయ ధర్మమని, కార్మికులకు ఎలాంటి అన్యాయం జరిగినా తానే గోడలా నిలుస్తానని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం, ఐఎన్‌టీయూసీ కలిసి కార్మికుల సమస్యల పరిష్కారానికి భుజం భుజం కలిపి పనిచేస్తాయని తెలిపారు.మీటింగ్ అనంతరం సింగరేణి క్యాంటీన్‌లో కార్మికులతో కలిసి అల్పాహారం చేసి, వారి సమస్యలను నేరుగా తెలుసుకుంటూ ఒక సహోద్యోగిలా కార్మికులతో మమేకమయ్యారు.ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు త్యాగరాజన్ మణుగూరు ఐఎన్ టియూసి బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ కృష్ణంరాజు మణుగూరు మండల అధ్యక్షులు పిరినాకి నవీన్, టౌన్ అధ్యక్షులు శివ సైదులు,శివాలయం చైర్మన్ కూచిపూడి బాబు,మైనార్టీ అధ్యక్షులు రహీం పాషా,విప్పల సింగారం సర్పంచ్ పాల్వంచ రాములు, దొడ్డ వెంకటప్పయ్య, పాలమూరు రాజు,జీ వి,బ్రాంచ్ కార్యదర్శి ఆదామ్,జీవరత్నం, రామారావు, అశోక్, అభిలాష్ సంతోష్ చరణ్, రామకృష్ణ, ఇంతియాజ్ పాషా, బుర్ర వెంకటేశ్వర్లు, జె శ్రీను, శ్రీనివాస్, సింగరేణి కార్మికులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎక్స్ లెంట్‌గా.. ముందస్తు సంక్రాంతి









రంగ వల్లులతో కలర్ ఫుల్ గా..ఎక్స్ లెంట్ స్కూల్

**మణుగూరు ఆర్సి,సూర్య (మేజర్ న్యూస్) –** మణుగూరు పైలెట్ కాలనీ ఎక్స్‌లెంట్ పాఠశాలలో శుక్రవారం ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఖాదర్, చైర్మన్ యూసఫ్ షరీఫ్, డైరెక్టర్ యాకుబ్ షరీఫ్ పాటు ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొని ఆనందంగా జరుపుకున్నారు. ఈ సందర్భంలో చైర్మన్ ఖాదర్ మాట్లాడుతూ రైతుల కృషిని గౌరవిస్తూ, ప్రకృతి పట్ల కృతజ్ఞతను వ్యక్త పరిచే ఈ పండుగ మన సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటుతోందన్నారు.ఈ పండుగను మూడు రోజుల పాటు జరుపుకుంటారని.. భోగి, సంక్రాంతి, కనుమ పండుగలు కుటుంబ సభ్యులను, బంధుమిత్రులను ఒక్కచోట చేర్చే పండుగ సంక్రాంతి అన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో సుఖ సంతోషాలు సమృద్ధి నింపాలని ఆకాంక్షస్తూ, పర్యావరణాన్ని పరిరక్షస్తూ, భద్రతా నియమాలను పాటిస్తూ సంప్రదాయాలకు విలువనిచ్చే పండుగను ఆనందంగా జరుపుకోవాలని కోరారు. సంబరాల్లో భాగంగా విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీలో గెలుపొందిన విద్యార్థులకు చైర్మన్ చేతుల మీదుగా బహుమతులను అందజేసారు. పాఠశాల ప్రాంగణంలో ఉపాధ్యాయులంతా కలిసి పిండి వంటలు చేసి, విద్యార్థులంతా ఆసక్తికరమైన నృత్యాలతో అలరింపజేసారు. అదేవిధంగా విద్యార్థులు హరిదాసులుగా మారి, విద్యార్థీనీలకు భోగిపండ్లు పోసి, పతంగులను ఎగురవేసి, బొమ్మల కొలువు చేసి, భోగి మంటలతో పండుగ వాతావరణం నెలకొల్పారు. ఎంతో భక్తితో పండుగను నిర్వహించారు.నేటి కాలంలో చరవాణిలో నిమగ్నమయ్యే రోజులలో కూడా విద్యార్థులంతా ముగ్గులపై ఆసక్తి చూపడం అనేది చాలా సంతోషకరమైన విషయమని ఖాదర్ అన్నారు.

# సిపిఐ శతాబ్ది వేడుక విజయవంతానికై ర్యాలీ

## - జెండా ఊపి ప్రారంభించిన సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్



ఖమ్మం రూరల్ సూర్య మేజర్ న్యూస్: సిపిఐ శతాబ్ది వేడుకల విజయవంతానికై ఎదులాపురం మున్సిపాలిటీలో ద్విచక్ర వాహన ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ జెండాను ఊపి ప్రారంభించారు. తొలుత ర్యాలీ ఎదులాపురంలోని దండి భాస్కర్ స్మారక స్థూపం వద్ద నుంచి ప్రారంభమైంది. ఈ ర్యాలీ వరంగల్ క్రాస్ రోడ్డు మీదుగా పెద్ద తండా చేరుకుని అక్కడి నుంచి జలగంనగర్, నాయుడుపేట, ఇందిరమ్మ కాలనీ ,చిన్న తండా, నడింతండా, సత్యనారాయణపురం, సాయి గణేష్ నగర్ మీదుగా ముత్తగూడెం లో నుంచి గొల్లగూడెం శ్రీ సిటీ ,పొన్నెకల్లు, మద్దులపల్లి ,తెల్లారుపల్లి నుంచి ఏదులాపురం ఆదిత్య నగర్ తో ముగిసింది. ఈ సందర్భంగా ఎర్రజెండాల రెపరెపలతో రహదారులు ఎర్ర శోభను సంతరించుకున్నాయి. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మెడకంటి చిన్న వెంకటరెడ్డి, సిపిఐ జిల్లా సమితి సభ్యులు చెరుకుపల్లి భాస్కర్, వెంపటి సురేందర్, మామిండ్ల శ్రీనాథ్ రెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి బూర మనోజ్, ఏవైఎఫ్ రాష్ట్ర నాయకుడు ఘనపరపు ఉపేందర్, సిపిఐ మున్సిపాలిటీ వార్డుల కార్యదర్శులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ అంతరాయం



ఖమ్మం సూర్య టౌన్ న్యూస్

10.01.2026 న ఉదయం 09 :00 గం నుండి 11:00 వరకు 33/11 కెవి వరంగల్ క్రాస్ రోడ్ సబ్ స్టేషన్ నందు గల 11 కేవీ వరంగల్ ఇ రోడ్ ఫీడర్‌లో మయింటెన్స్ కలదు. ఖమ్మం రూరల్ సూర్య మేజర్ న్యూస్ : ఖమ్మం రూరల్ మండలంలో నేడు విద్యుత్ అంతరాయం.33/11 కెవి వరంగల్ క్రాస్ రోడ్ సబ్ స్టేషన్ నందు గల 11 కేవీ వరంగల్ ఇ రోడ్ ఫీడర్ లో మయింటెన్స్ కలదు.కావున లుంబినివనం ఏదులాపురం, శ్రీరామ నగర్,ఆదిత్య నగర్ 1&2, వరంగల్ క్రాస్ రోడ్,షాబాద్ నగర్, కార్తికేయ టౌన్ షిప్,సాయి బృందావనం మరియు గుర్రాలపాడు, పంచాయితీలా పరిధి లలో విద్యుత్ సరఫరా కి అంతరాయం ఉంటుంది ,కావున గృహ వినియోగదారుల ,ఇండస్ట్రియల్ వినియోగదారులు, గమనించి సహకరించాలని విద్యుత్ ఏఈ ప్రభాకర్ కోరుతున్నారు.

# కాంగ్రెస్ పార్టీ చేసిన పనులు చెప్పుకుంటూ పోతే ఇంకో పార్టీకి భవిష్యత్తు ఉండదు

## -మధిర అభివృద్ధి చెందితేనే భవిష్యత్ తరాలకు మంచిది
## -మధిర నగరం క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉండాలి అనుకునే వారినే గెలిపించుకోవాలి
## -మధిర మున్సిపల్ కీలక నాయకుల ప్రత్యేక సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు





ఖమ్మం (సూర్య బ్యూరో): కాంగ్రెస్ పార్టీ చేసిన పనులు చెప్పుకుంటూ పోతే ఈ దేశంలో ఇంకో పార్టీ పుట్టేదే కాదు, మరో పార్టీకి భవిష్యత్తు ఉండేది కాదు అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శుక్రవారం ఆయన మధిర మున్సిపాలిటీ పరిధిలోని మడుపల్లి లో కాంగ్రెస్ కీలక నేతలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఇతర పార్టీలు రెండు మూడు దశాబ్దాల క్రితం చేసిన ఐదు లక్షల పనిని మైకు దొరికిన ప్రతిసారి చెప్పుకుంటూ పోతారు, కానీ కాంగ్రెస్ శ్రేణులు ప్రచారంలో వెనుకంజలో ఉండటం మూలంగా ఇబ్బంది ఏర్పడుతుందని డిప్యూటీ సీఎం తెలిపారు. మధిర మున్సిపాలిటీ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా మధిర నగరానికి వచ్చిన రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఆరోగ్యశ్రీ, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సు ప్రయాణం వంటి పథకాలను ప్రతి నాయకుడు రోజు పదిమందికి వివరిస్తే చాలని సూచించారు. మధిర పట్టణం అభివృద్ధి చెందాలి క్లీన్ అండ్ గ్రీన్ గా ఉంటేనే భవిష్యత్తు తరాలు బాగుపడతాయని ఆలోచించే వ్యక్తులను గెలిపించుకోవాలని డిప్యూటీ సీఎం పిలుపునిచ్చారు. మధిర పట్టణానికి కాంగ్రెస్ చేయని పని అంటూ లేదు అన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, అండర్ గ్రౌండ్ విద్యుత్తు, చెరువులను టూరిజం పార్కులుగా తీర్చిదిద్దడం, డిగ్రీ, ఇంటర్, హై స్కూల్ విద్యాసంస్థలకు సొంత భవనాలు, అగ్రికల్చర్ పాలిటెక్నిక్, జనరల్ పాలిటెక్నిక్, ఐటిఐ ని అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ గా మార్చడం, బస్టాండ్, ట్రెజరీ, బ్యాంకులను తీసుకురావడం వంటి గొప్ప పనులు చేసాం ఇవి మున్సిపాలిటీలోని ఓటర్లకు వివరించాల్సిన అవసరం ఉందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఒక మంచి ఇల్లు కట్టాలి అనుకున్నప్పుడు మొదట సిమెంటు, కంకర, ఇటుకలు ఎక్కడపడితే అక్కడ ఉంటాయి చిందరవందరగా కనిపిస్తుంది కానీ ఇల్లు పూర్తయిన తర్వాత అందంగా కనిపిస్తుంది అదే తరహాలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి అది పూర్తయితే నగరం సుందరంగా మారుతుందని తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తయిన చోట మట్టిని పూడ్చాలని అధికారులకు ఆదేశించినట్లు తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తయిన తర్వాత మధిర నగరం మొత్తంగా కొత్త సిసి రోడ్ల నిర్మాణం జరుగుతుందని వివరించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ద్వారా టాయిలెట్లలోని మురుగునీరు బయటకు వెళ్తుంది, సీనరేజి ట్రీట్మెంట్ ప్లాంట్లలో ఆ మురుగునీటిని శుద్ధి చేసి బయటకు విడుదల చేస్తారు, వర్షం నీటిని ఏట్లోకి మళ్లించేందుకు ప్రత్యేకంగా డ్రైనేజీ వ్యవస్థ ఉంటుందని వివరించారు. మధిర మున్సిపాలిటీలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకొని అభివృద్ధి పనులు చేసుకోవాల్సిన అవసరం ఉంది అన్నారు అభివృద్ధి పనులు జరిగితేనే మధిర పట్టణం అభివృద్ధి చెందుతు ఒది తద్వారా భవిష్యత్తు తరాలకు మంచి జరుగుతుందని వివరించారు.

# మారుతీ సుజుకి షోరూమ్ ఉద్యోగ,కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి....సీఐటీయూ






ఖమ్మం రూరల్ సూర్య మేజర్ న్యూస్ : ఖమ్మం రూరల్ మండలంలోని పెద్దతండా వద్ద గల మారుతి సుజుకి షోరూం యాజమాన్యం పట్టుదలకు వెళ్లకుండా ఉద్యోగ,కార్మికుల సమస్యను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పెరుమళ్ళపల్లి మోహన్ రావు అన్నారు. ఉద్యోగ,కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గత నాలుగు రోజు లుగా సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్న కార్మికులనుద్దేశించి మోహన్ రావు శుక్రవారం మాట్లాడారు.మారుతి సుజుకి అండ్ పరమశివ షోరూం కార్మికులు గత 22 ఏళ్లుగా వివిధ కేటగిరీలో 140 మంది పనిచేస్తున్నారని వారికి ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ఈనెల 5వ తేదీన ఉదయం 9 గంటలకు షోరూం నష్టాల్లో ఉంది మీరు వేరే పని చూసుకొండని యాజమాన్యం సెల్ ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం ఇవ్వడం దుర్మార్గమన్నారు. 140 మంది కార్మికులు 22 ఏళ్లుగా ఒక సంస్థను నమ్ముకొని పనిచేస్తుంటే వాళ్ళని అర్ధాంతరంగా తొలగించడం మంచి పద్ధతి కాదన్నారు.షో రూమ్ ఉద్యోగ,కార్మికులకు యాజమాన్యం న్యాయం చేయకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. వారికి వివిధ రకాల బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం ఖమ్మం రూరల్ మండల కార్యదర్శి ఉరడీ సుదర్శన్ రెడ్డి,సీఐటీయూ నాయకులు మల్లికార్జునరావు,కర్లపూడి వెంకటేశ్వర్లు,సంస్థ ఉద్యోగ, కార్మికులు నాగ శ్రీనివాస్ రావు,రాందేవ్, వెంకటేశ్వరరావు,నక్రుపాషా,భరద్వాజ,కృష్ణ,నవీన్, రజిత, నరసింహా రావు, ప్రసాద్,ప్రకాష్,ప్రవీణ్ కుమార్,ఉపేంద్ర చారి పాల్గొన్నారు.

# లూయిూ బ్రెయిలీ సంస్కరణలు మరువలేనివి

## -కార్పొరేటర్ షేక్ మక్బూల్





ఖమ్మం టౌన్ సూర్య న్యూస్: అంధులకు జ్ఞాన కవాటాలైన పఠన, రాతలో బ్రెయిలీ లిపిని కనుగొన్న లూయి బ్రెయిలీ అంధులకు అందించిన సంస్కరణలు చిరస్మరణీయమని 23 వ డివిజన్ కార్పొరేటర్, టిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ షేక్ మక్బూల్ అన్నారు. శుక్రవారం లూయి బ్రెయిలీ 217వ జన్మదిన వేడుకలను డివిజన్లోని పాక బండలోని బ్రెయిలీ విగ్రహం వద్ద కేకు కట్ చేసి పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మక్బూల్ మాట్లాడుతూ దృష్టిలోపం ఉన్నవారికి జ్ఞానాన్ని అందించిన గొప్ప ఆవిష్కర్తగా ప్రపంచవ్యాప్తంగా పేరుగాంచారన్నారు. చిన్నతనంలోనే ప్రమాదం వల్ల అంధుడైనప్పటికీ తన అనుభవంతో అంధులకు చూపు లేనప్పటికీ చదవడం, రాయటంలో విప్లవాత్మకమైన పద్ధతిని అభివృద్ధి చేసి ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది చూపు లేని వారి జీవితాలలో వెలుగులు నింపారన్నారు. అనంతరం అంధులకు పరికరాలు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి వి విజేత, సీ డీపీఒ వీరభద్రమ్మ, నాయకులు వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## జనవరి 30 లోపు ఫౌండేషన్ కోర్సు ప్రవేశ పరీక్షకు దరఖాస్తు సమర్పించాలి...

**-జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**ఫిబ్రవరి 8, 2026న ఫౌండేషన్ కోర్స్ ప్రవేశ పరీక్ష నిర్వహణ**



**ఖమ్మం (సూర్య బ్యూరో):** ఖమ్మం ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో రెసిడెన్షియల్ పద్ధతి లో 5 నెలల పాటు ఉచిత శిక్షణ అందించే ఫౌండేషనల్ కోర్సు ప్రవేశ పరీక్షకు ఆసక్తి గల అభ్యర్థులు జనవరి 30 లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రూప్స్, రైల్వే రిక్రూట్మెంట్ బోర్డ్, స్టాఫ్ సెలక్షన్ కమిటీ, బ్యాంకింగ్ మొదలైన వివిధ పోటీ పరీక్షలకు సంబంధించి భోజన వసతితో కూడిన 5 నెలల బేసిక్ ఫౌండేషన్ కోర్సును అర్హులైన 100 మంది అభ్యర్థులకు ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ఎస్సీలకు 75 శాతం, ఎస్టీలకు 10 శాతం, బీసీలకు, మైనారిటీ లకు కలిపి 15 శాతం, ఓవరాల్ మహిళలకు 33.3 శాతం, దివ్యాంగులకు ఐదు శాతం చొప్పున రిజర్వేషన్ పాటించడం జరుగుతుందని, అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం 3 లక్షల లోపు ఉండాలని, అభ్యర్థులు డిగ్రీ ఉత్తీర్ణత సాధించి ఉండాలని అన్నారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు స్టడీ సర్కిల్ ప్రవేశ పరీక్షకు http://tsstudycircle.co.in వెబ్ సైట్ లో జనవరి 30 లోపు దరఖాస్తులు సమర్పించా లని, ఫిబ్రవరి 8న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందని, ఇతర వివరాలకు 9866726277, 7981988667 నెంబర్ నందు సంప్రదించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## వన్యప్రాణుల వేట యత్నం భగ్నం







**తల్లాడ సూర్య మేజర్ న్యూస్ :** లక్ష్మపురం అటవీ ప్రాంతంలో వన్యప్రాణులను వేటాడేందుకు దుండగులు వేసిన భారీ కుట్రను అటవీ శాఖ అధికారులు సమర్థవం తంగా అడ్డుకున్నారు. ఘటన వివరాలు: తల్లాడ రేంజ్, కల్లురు సెక్షన్, లక్ష్మపురం బీట్ పరిధిలోని పంగిడి చెరువు సమీపంలో కొందరు వేటగాళ్లు ప్రవేశించి వన్యప్రాణులను బంధించేందుకు సర్వీస్ వైర్ల ద్వారా ఉచ్చులు (వైర్ స్నార్స్) ఏర్పాటు చేశారు. ఫోరెస్ట్ బీట్ ఆఫీసర్ తక్షణమే స్పందించి ఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడ అమర్చిన ఉచ్చులను పూర్తిగా తొలగించి, వన్యప్రాణులకు కలగబోయే ప్రాణాపాయాన్ని తప్పించారు. డి.ఎఫ్.ఓ హెచ్చరిక : ఈ ఘటనపై జిల్లా అటవీ శాఖ అధికారి (ఐఖీూ) సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, ఐఎఫ్ఎస్ స్పందిస్తూ, వన్యప్రాణుల వేటపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. కఠిన చర్యలు: వన్యప్రాణుల సంరక్షణ చట్టం-1972 ప్రకారం వన్యప్రాణులను వేటగాళ్ల నుంచి రక్షంచడం మా బాధ్యత. వేట చేయడం లేదా ఉచ్చులు బిగించడం వంటి చర్యలకు పాల్పడితే వారిపై నాన్-బైలబుల్ కేసులు నమోదు చేస్తాం. ప్రజలకు విజ్ఞప్తి: అటవీ సంపదను, వన్యప్రాణులను కాపాడటంలో ప్రజలు సహకరించాలి. ఎవరైనా అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని వారు స్పష్టం చేశారు.

## రోడ్డు ప్రమాదాల నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యత....

**-అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి**

**-పెట్రోల్ బంక్ కు 100 మీటర్ల దూరంలో రోడ్డుపై బ్లింకర్స్, రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు**

**-రోడ్డు భద్రత ప్రమాణాలపై పెట్రోల్ బంక్ నిర్వాహకులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అదనపు కలెక్టర్**








**ఖమ్మం (సూర్య బ్యూరో):** రోడ్డుపై ప్రమాదాల నియంత్రించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో రోడ్డు భద్రత ప్రమాణాలపై శుక్రవారం పెట్రోల్ బంక్ నిర్వాహకులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల వల్ల ఒక వ్యక్తి దురదృష్టవశాత్తు మరణించినా, వైకల్యం పొందినా ఒక కుటుంబం దెబ్బతింటుందని అన్నారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాలను నియంత్రించడంలో తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని అదనపు కలెక్టర్ తెలిపారు. పెట్రోల్ బంక్ ఎంట్రీ, ఎగ్జిట్ కు కొద్ది దూరం నుంచి కర్వ్ ఉంటూ ప్రధాన రోడ్డు కలిసే విధంగా అవసరమైన మార్పులు చేసుకోవాలని అదనపు కలెక్టర్ పెట్రోల్ బంక్ డీలర్లకు సూచించారు. నూతనంగా పెట్రోల్ బంక్ ఏర్పాటు చేసే సమయంలో ఎంట్రి, ఎగ్జిట్ వద్ద కర్వ్ తో కూడిన రోడ్డు ఉండేలా చూడాలని అన్నారు. పెట్రోల్ బంక్ ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ లకు దూరంలో ప్రచార బోర్డులు ఏర్పాటు చేయాలని అన్నారు. పేట్రోల్ బంక్ కు ఇరు వైపులా 100 మీటర్ల దూరంలో రోడ్డుపై బ్లింకర్స్, రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. పెట్రోల్ బంక్ లో పని చేసే సిబ్బంది యూనిఫాం ద్వారా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడంపై ప్రచారం కల్పించాలని అన్నారు.

పెట్రోల్ బంకు వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్ తప్పని సరిగా ఉండాలని, పెట్రోల్ బంక్ నిర్వాహకులు, సిబ్బందికి సీపీఆర్ ట్రైయినింగ్ అందించాలని, దానికి అవసరమైన కార్యాచరణ తయారు చేయాలని అదనపు కలెక్టర్ తెలిపారు. పెట్రోల్ బంక్ వద్ద సెల్ ఫోన్ వాడక పోవడం, వాహన ఇంజన్ ఆఫ్ చేయడం కీలకమని, దీనిని కట్టుదిట్టంగా అమలు చేయాలని అన్నారు. జిల్లాలో అధికంగా ప్రమాదాలు జరుగుతున్న 50 రోడ్లను గుర్తించి అక్కడ మున్సిపల్, ఆర్ అండ్ బీ, నేషనల్ హైవే, రెవెన్యూ, రవాణా శాఖ సంయుక్తంగా పరిశీలించి ప్రమాదాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఓ డి. జగదీష్, డి.ఎల్.ఎం.ఓ. ప్రవీణ్ కుమార్, ఆర్ అండ్ బి డిఈ జి. రాధిక, పౌర సరఫరాల శాఖ కార్యాలయ సిబ్బంది, వివిధ పెట్రోల్ బంక్ నిర్వాహకులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి రాజగోపాల్ ను కలసిన, టిడబ్ల్యూజేఎఫ్ (హెచ్-2843) నేతలు

**- జర్నలిస్టుల ఇండ్ల స్థలాల అంశాన్ని జిల్లా అధ్యక్షులు సంతోష్ చక్రవర్తి ద్వారా తెలుసుకున్న ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి**





**ఖమ్మం (సూర్య బ్యూరో):** ఖమ్మం జిల్లాలో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల కేటాయింపుల అంశంలో నెలకొన్న అనిశ్చితిపై న్యాయ సహకారం అందించాలని కోరుతూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్- హెచ్-2843) జిల్లా కమిటీ బృందం జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి జి.రాజగోపాల్ ను ఆయన చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా రాబోయే సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి జి. రాజగోపాల్ కు ముందస్తు శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ భేటీలో జిల్లా అధ్యక్షులు టి. సంతోష్ చక్రవర్తి మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో జర్నలిస్టులకు మంజూరైన ఇండ్ల స్థలాల విషయంలో ప్రస్తుత ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు తీవ్ర అనిశ్చితిని సృష్టిస్తున్నాయని జడ్జి దృష్టికి తీసుకువచ్చారు. హైదరాబాద్‌లో న్యాయ నిపుణులు జర్నలిస్టుల ఇండ్ల స్థలాల అంశంపై చేసిన సూచనలు, సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా ఉన్న న్యాయపరమైన అంశాలను వివరించి, జర్నలిస్టులకు చట్టపరమైన పరిరక్షణ కల్పించాలని వినతిపత్రం ద్వారా విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి రాజగోపాల్, సుప్రీంకోర్టు తీర్పులు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు వర్తిస్తాయని స్పష్టం చేశారు. జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు సమర్పించిన వినతిపత్రంలోని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి, చట్ట పరిధిలో సాధ్యమైన న్యాయ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. సమాజంలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమని, కఠిన పరిస్థితులను ఎదుర్కొంటూ ప్రజల పక్షన నిలబడి వారు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ, కోశాధికారి అర్వపల్లి నగేష్, టీబీజేఏ జిల్లా అధ్యక్షులు వందనపు సామ్రాట్ గుప్తా, ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ అంతోటి శ్రీనివాస్, లీగల్ అడ్వైజర్ పసుపులేటి శ్రీనివాస రావు, కుంభం రవి కుమార్, కాసోజు శ్రీధర్, సుధాగాని కరుణాకర్, కప్పల మధు గౌడ్, సాపవత్ నాగరాజు, చిన్నంశెట్టి రాంబాబు, అమరబోయిన ఉపేందర్, కందరపోయిన నాగకృష్ణ, వంగ పుంగమ గౌడ్, కొండల్, ఎలుగోటి వెంకట్, కరాటే వేణు, నాయిని స్వాతి, తుమ్మలపల్లి శ్రీనివాస్, షేక్ సోందుమియా, మల్లెల శిల్ప, రమేష్, గంటేల కుమార్, మందడపు మనోహర్, సురేష్, నరేష్ పాల్గొన్నారు.

# పకడ్బందీగా ఇంటర్ పరీక్షలను నిర్వహించాలి...

-అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి
-ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు ఇంటర్ థియరీ పరీక్షల నిర్వహణ
-ఇంటర్ పరీక్షల కోసం 66 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు
-ప్రతి పరీక్ష కేంద్రం వద్ద పారా మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండాలి
-పరీక్ష సమయానుకూలంగా ఆర్టీసీ బస్సులు నడపాలి
-ఇంటర్ పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్షించిన అదనపు కలెక్టర్





ఖమ్మం (సూర్య బ్యూరో):
జిల్లాలో ఇంటర్ పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్, కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం ఇంటర్ పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు జరిగే ఇంటర్ పరీక్షల నిర్వహణకు జిల్లాలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. జిల్లాలో జనరల్, ఒకేషనల్ కలిపి మొత్తం 35 వేల 188 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. ఖమ్మం జిల్లాలో ఏర్పాటు చేసిన 66 పరీక్ష కేంద్రాలలో ఇంటర్ థియరీ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, 67 పరీక్ష కేంద్రాల్లో ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 2 నుంచి ఫిబ్రవరి 21 వరకు ఉదయం, సాయంత్రం రెండు సెషన్స్ లో జరుగుతాయని అన్నారు. ఆంగ్లం ప్రాక్టికల్ పరీక్ష మొదటి సంవత్సరం విద్యార్థు లకు జనవరి 21న, రెండవ సంవత్సరం విద్యార్థులకు జనవరి 22న జరుగు తుందని, జనవరి 23న ఎథిక్స్, మానవ విలువలు, జనవరి 24న పర్యావరణ అవగాహనపై ఇంటర్నల్ పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతాయని అన్నారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి పకడ్బందీగా పరీక్షలు నిర్వహించా లని, పరీక్ష కేంద్రాల వద్ద నిరంతర విద్యుత్ సరఫరా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, త్రాగు నీరు అందించాలని, అవసరమైన మౌళిక సదుపాయాలు కల్పించాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పరీక్షల నేపథ్యంలో విద్యార్థుల సౌకర్యార్థం రవాణా కోసం పరీక్షకు సకాలంలో హాజరయ్యే విధంగా అనుకూలంగా ఆర్టీసీ బస్సులు పరీక్ష కేంద్రాల రూట్ లలో స్పెషల్ బస్సులు నడపాలని అన్నారు. రెసిడెన్షియల్ విద్యా సంస్థలలో చదివే ఇంటర్ విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. పరీక్ష కేంద్రాలలో పనిచేసే ఇన్విజిలేటర్ లకు అవసరమైన శిక్షణ అందించాలని అన్నారు. పరీక్ష కేంద్రంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని, పరీక్ష ప్రశ్న పత్రాల లీకేజీ ఎట్టి పరిస్థితుల్లోనూ జరగకుండా చీఫ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో సీసీ కెమెరాల సమక్షంలో ప్రశ్న పత్రాల కవర్ సీళ్లు ఓపెన్ చేయాలని, ఆ సమయంలో అధికారులు సెల్ ఫోన్ తీసుకు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లు, కనీస మందులతో పారా మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ పద్మశ్రీ , జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కే.రవి బాబు , ఆర్టిసి, విద్యుత్, పంచాయతీ, మునిసిపల్, పోస్టల్, పోలీస్, సంబంధిత ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత టైలరింగ్ శిక్షణతో మహిళలు ఆర్థికంగా ఎదగాలి

- బిఆర్ఎస్ నాయకులు తోట రామారావు
- మాతృశ్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 60 మంది మహిళలకు సర్టిఫికెట్ల ప్రదానం
- కులమతాలకు అతీతంగా 60 మంది మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ








ఖమ్మం టౌన్ సూర్య న్యూస్
శ్రీ మాతృ మహిళా మండలి, మాతృశ్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలోని 46, 47, 48 డివిజన్లకు చెందిన సుమారు 60 మంది మహిళలకు రెండు నెలలపాటు టీఆర్ఆర్ కాంప్లెక్స్‌లో విజయవంతంగా ఉచిత టైలరింగ్ శిక్షణ పొందిన మహిళలు ఆర్థికంగా ఎదగాలని బిఆర్ఎస్ నాయకులు తోట రామారావు అన్నారు. ఈ శిక్షణ ముగింపు సందర్భంగా శుక్రవారం సారధి నగర్ లోని టీఆర్ఆర్ కాంప్లెక్స్ నందు ఏర్పాటుచేసిన సమావేశంలో మహిళలందరికీ ఉచిత భోజన సదుపాయంతో పాటు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమానికి 48వ డివిజన్ కార్పొరేటర్ తోట గోవిందమ్మ, తోట రామారావు లు ఉచితంగా కాంప్లెక్స్‌ను ఇవ్వడంతో పాటు మహిళలకు అవసరమైన అన్ని సౌకర్యాలు దగ్గరుండి ఏర్పాటు చేయడం హర్షణీయమని మాతృశ్రీ ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా తోట రామారావు, కార్పొరేటర్ తోట గోవిందమ్మ లు మాట్లాడుతూ... టైలరింగ్ శిక్షణ పొందిన మహిళలు ఇంట్లోని కుటుంబ సభ్యుల దుస్తులు కుట్టుకోవడంతో పాటు మహిళలకు సంబంధించిన జాకెట్లు, లంగాలు కుట్టడం ద్వారా కుటుంబానికి తోడ్పడగలరన్నారు. అదేవిధంగా మరింత శిక్షణ పొంది నైపుణ్యం పెంచుకుంటే ఆర్థికంగా స్వతంత్రంగా ఎదగవచ్చని సూచించారు. ఒక మహిళ ఆర్థికంగా నిలబడితే కుటుంబం మొత్తం సంతోషంగా ఉంటుందని తెలిపారు. డివిజన్లోని మహిళలు కుల, మత, ప్రాంత, రాజకీయాలకు అతీతంగా ఒక కుటుంబం గా ఐక్యతతో శిక్షణ పొందినందుకు అభినందనలు తెలిపారు. శిక్షణ పొందిన మహిళలకు ప్రభుత్వం ఉచితంగా కుట్టు మిషన్లు అందజేయాలని, జిల్లా కలెక్టర్‌తో పాటు ఇతర జిల్లా అధికారులు స్పందించి వారికి సహకారం అందించాలని కోరారు. అదేవిధంగా తోట రామారావు మాట్లాడుతూ.. తమ కుమారుడు ఖమ్మం ప్రభుత్వ .బీఆసుపత్రిలో ఎంఎస్ ఆర్థోపెడిక్ డాక్టర్‌గా పనిచేస్తున్నారని, అవసరమైన వారికి టీఆర్ఆర్ ఆర్థోపెడిక్ హాస్పిటల్‌లో మాస్టర్ ఆఫ్ సర్జన్ డాక్టర్ తోట లక్ష్మణ్ కుమార్ ద్వారా ఉచిత వైద్య సదుపాయాలు అందిస్తామని, ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శ్రీ మాతృ మహిళా మండలి, మాతృశ్రీ ఫౌండేషన్ ఉపాధ్యక్షురాలు ఎస్.కె. జాస్మిన్ మాట్లాడుతూ.. రెండు నెలల పాటు 60 మంది మహిళలు ఉచితంగా టైలరింగ్ నేర్చుకున్నారని, ఈ నైపుణ్యంతో వారి కుటుంబాలను ఆర్థికంగా బలపరుచుకోవాలని తెలిపారు. శిక్షణ పొందిన మహిళలు ఉద్యోగం కావాలనుకుంటే తమను సంప్రదిస్తే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. శిక్షణ పొందిన మహిళలు మాట్లాడుతూ.. ఎంతోకాలంగా ఉపాధికి తగిన శిక్షణ లేక ఇబ్బందులు పడుతున్న మాకు మాతృశ్రీ ఫౌండేషన్ ఇచ్చిన శిక్షణ ఎంతో ఉపయోగపడిందని, ఇంటి వద్దే ఉపాధి పొందే అవకాశం కలిగిందని తెలిపారు. ఇందుకు సహకరించిన బిఆర్ఎస్ నాయకులు తోట రామారావు, మాతృశ్రీ ఫౌండేషన్ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. 46వ డివిజన్ నాయకులు కనకం భద్రయ్య, బొల్లెపల్లి విజయ్, ఆకుల సత్యం, జి. కృష్ణ నాయక్, తోట రమేష్ కుమార్, మాటేటి కిరణ్ లు మాట్లాడుతూ... తోట రామారావు కుటుంబం సర్వీస్ ఓరియెంటెడ్‌గా ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటుందని, వరదల సమయంలోనూ, వేసవి సమయాలలో, ఆపద సమయాలలో బాధిత కుటుంబాలకు భోజనం, వైద్యం, ఆర్థిక సహాయాలు అందించిన కుటుంబమని వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాతృశ్రీ ఫౌండేషన్ సూపర్వైజర్ ఎండి. చాందిని, టైలరింగ్ టీచర్ ఎస్.కె. అరీషా, టైలరింగ్ శిక్షణ పొందిన మహిళలు పాల్గొన్నారు.

# నేలపట్లలో ఘనంగా కందాల జన్మదిన వేడుకలు







ఖమ్మం సూర్య టౌన్ న్యూస్
మాజీ ఎం. ఎల్.ఏ. కందాల ఉపేందర్ రెడ్డి జన్మదినం సందర్భంగా మండల పరిధిలోని నేలపట్ల గ్రామంలో శుక్రవారం బిఆర్ ఎస్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సెంటర్ లో టపాసులు పేల్చి కేక్ కట్ చేసి గ్రామస్తులకు పంచి పెట్టారు. అదేవిధంగా ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు చాక్లెట్లు,పెద్దలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు అలవాల లింగయ్య మాట్లాడుతూ పెద,బడుగు,బలహీన వర్గాల ఆశాజ్యోతి,మాజీ ఎం.ఎల్. ఏ. కందాల ఉపేందర్ రెడ్డి గారు భవిష్యత్ లో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఆయనకు ఈ సందర్భంగా పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దోమలవెంకులు,మోహన్,సంగయ్య వార్డు మెంబర్స్ సీహెచ్ ఉపేందర్, డి. చంద్రమ్మ, కె.కల్పన, జాల. నాగయ్య, చెరుకుపల్లి. నాగయ్య, వెంకటేష్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

# స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శిగా కాల్లోజు అచ్చయ్య ...



అన్నపురెడ్డిపల్లి, సూర్య (మేజర్ న్యూస్) - స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శిగా అన్నపురెడ్డిపల్లి గ్రామానికి చెందిన కాల్లోజు అచ్చయ్య ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలో జిల్లా అధ్యక్షులు ఐనంపూడి జపాన్ రావు అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేసి ఆ సమావేశంలో జిల్లా కార్యదర్శిగా అచ్చయ్యను ఎన్నుకోవడం జరిగింది. దమ్మపేట మండలం టి.యం గుంపు యుపిఎస్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ జిల్లా స్థాయిలో ఎన్నిక కావడంతో ఆయనకు పలువురు అభిన ఒదనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కాల్లోజు అచ్చయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల కోసం కృషి చేస్తానని, జిల్లా స్థాయిలో ఇంత బాధ్యత రావడం ఉపాధ్యాయ వృత్తిపై మరింత బాధ్యత పెంచిందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర అధ్యక్షులు దేవరకుంట సైదులుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మ నర్స్ గౌడ్, కార్యవర్గ సభ్యులు, పాల్గొన్నారు.

# మహిళలకు ఉత్తమ వైద్య సేవలు అందించాలి

**- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

**-ఇల్లందులో ప్రియాంక వైద్యశాల ప్రారంభం**





ఇల్లందు ఆర్ సి, సూర్య (మేజర్ న్యూస్)- నూతనంగా ఇల్లందు పట్టణంలో నెలకొల్పిన ప్రియాంక ప్రసూతి వైద్యశాల వైద్యులు మహిళలకు ఉత్తమ వైద్య సేవలను అందించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పట్టణంలో ప్రియాంక మేటర్నిటీ వైద్యశాలను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం ఎమ్మెల్యే కోరం కనకయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని ఇల్లందు పట్టణంలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం హర్షనీయమ న్నారు. ఏజెన్సీ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు వైద్యులు పేదలకు అందుబాటు లో వైద్యశాలను ఏర్పాటు చేయడం గొప్ప విషయం అన్నారు. మహిళలకు ప్రసూతి, అత్యవసర వైద్య సేవలను వైద్యశాలలో అందించనున్నట్లు వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. షుగర్, బిపి, థైరాయిడ్, గుండె, జనరల్ ఫిజీషియన్ వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని వైద్యుడు శేఖర్ (ఎండీ), వైద్యురాలు ప్రియాంక (ఎంబీ బీఎస్, యం యస్, ఓబీజీ) తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# అక్రిడిటేషన్ కార్డుల జీవో నెంబర్ 252ను సవరించాలి..

**- మంత్రి పొంగులేటికి జర్నలిస్టుల వినతి పత్రం**



ఇల్లందు ఆర్ సి,సూర్య (మేజర్ న్యూస్)- జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబర్ 252 ను సవరించాలని టియుడబ్ల్యూజే ఆధ్వర్యంలో రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కి, ఎమ్మెల్యే కోరం కనకయ్య కు వినతి పత్రం అందజేశారు. శుక్రవారం ఇల్లెందు లో పర్యటించిన మంత్రిని కలిసిన జర్నలిస్టులు జర్నలిస్టులకు కనీస హక్కుగా ఇచ్చే అక్రిడిటేషన్ కార్డులను భారీ స్థాయిలో తగ్గిస్తూ, డెస్క్ జర్నలిస్టులకు వేరుగా, బ్యూరో జర్నలిస్టులకు వేరుగా రెండు కార్డుల విధానాన్ని తీసుకువచ్చి జర్నలిస్టుల మధ్య విభజన రేఖలు ఇస్తున్న 252 జీవోను వెంటనే సవరించాలని కోరారు. తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం పోరాటం చేస్తున్న విషయం తెలిసిందే. గతంలో ఉన్న 239 జీవో ఆధారంగా 23 వేల కార్డులు రాగా నూతనంగా తీసుకొచ్చిన జీవోతో 13 వేల కార్డులు తగ్గనున్నాయని తెలిపారు. ఇలా జరిగితే జర్నలిస్టులకు తీరని అన్యాయం ప్రభుత్వం చేసినట్లు అవుతుందన్నారు. కాబట్టి ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ఈ అంశంపై సభలో చర్చించి ప్రభుత్వానికి మీ ద్వారా తగు సూచన చేసి జీఓ సవరణ విషయంలో జర్నలిస్టు సమాజానికి మద్దతుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్లుజే (ఐజెయూ ) జాతీయ కౌన్సిల్ సభ్యులు గుర్రం రాజేష్, బత్తుల రాధాకృష్ణ, తాడూరి శేఖర్, నందు తదితరులు పాల్గొన్నారు.

# విజయలో ఘనంగా హ్యాకథన్ కార్యక్రమం





కొణిజర్ల సూర్య (మేజర్ న్యూస్) మండల పరిధిలోని తనికెళ్ల అమ్మపాల గ్రామ సమీపంలో గల విజయ ఇంజనీరింగ్ కళాశాల యందు శుక్రవారం నిర్వహించిన హ్యాకథన్ కార్యక్రమం విజయవంతం అయింది. విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలతో పాటు సాంకేతిక నైపుణ్యాలను మరింతగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో మైస్పార్క్ అకాడమీ మరియు నోవేషన్ లెర్నింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించ ఈ కార్యక్రమశీలో విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. సుమారు100 టీమ్స్ హ్యాకథన్‌లో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్, వెబ్ ఁ మొబైల్ అప్లికేషన్ డెవలప్‌మెంట్ వంటి వివిధ డొమైన్స్‌లో విద్యార్థులు కోడింగ్ ఆధారిత ప్రాజెక్టులను అభివృద్ధి చేశారు. వాస్తవ జీవిత సమస్యలకు పరిష్కారాలు చూపేలా రూపొందించిన వారి ప్రాజెక్టులు అబ్బురు పరిచే విధంగా ఉండటంతో న్యాయనిర్ణేతలను ఆకట్టుకున్నాయి. హ్యాకథన్ కార్యక్రమంలో ఉత్తమ కోడింగ్ ప్రతిభ కనబరిచిన విజేత రేవంత్ టీం కు, రన్నర్ ఎండీ ఇర్ఫాన్ టీం కు అలాగే అచీవర్స్ వెంకట మరియు ఉమా మహేష్ టీమ్స్ కు, ప్రతిభ కనపరచిన వారికి బహుమతులు, సర్టిఫికెట్లను మైస్పార్క్ అకాడమీ సి ఈ ఓ శ్రీ కవితపారుపల్లి యెర్ర, నోవేషన్ లెర్నింగ్ ప్రవేట్ లిమిటెడ్ సి ఈ ఓ స్వాతి రుషిత చేతుల మీదగా అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రతిభను నిర్వాహకులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నోవేషన్ లెర్నింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ స్వాతి రుషీత మాట్లాడుతూ ఇలాంటి హ్యాకథన్‌లు విద్యార్థుల్లో ప్రాక్టికల్ నాలెడ్జ్‌ను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను విద్యార్థుల్లో పెంచేందుకు ఇవి ఎంతో దోహద పడతాయినీ ఆమె తెలిపారు. మై స్పార్క్ అకాడమీ సీఈఓ శ్రీకవిత పారుపల్లి యెర్ర మాట్లాడుతూ, నేటి విద్యా వ్యవస్థలో థియరీతో పాటు ప్రాక్టికల్ లెర్నింగ్ ఎంతో అవసరమని, హ్యాకథన్‌ల వంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులు కొత్త ఆలోచనలను ఆవిష్కరించ గలరని అన్నారు. విద్యార్థులు టెక్నాలజీని సమాజానికి ఉపయోగపడే విధంగా వినియోగించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న విజయ ఇంజినీరింగ్ కాలేజ్ వైస్ చైర్‌పర్సన్ శ్రీమతి పారుపల్లి విజయలక్ష్మ మాట్లాడు తూ, విద్యార్థుల సమగ్ర అభివృ ద్ధికి ఇలాంటి సాంకేతిక కార్యక్రమాలు ఎంతో అవసరమని, విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, సమస్య పరిష్కార నైపుణ్యాలు పెరగడంలో హ్యాకథన్‌లు కీలక పాత్ర పోషిస్తాయని ఆమె పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా మరిన్ని సాంకేతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆమె వెల్లడించారు. న్యాయనిర్ణేతలుగా శ్రీకవిత పారుపల్లి యెర్ర, స్వాతి రుషీత, ఉదయ్ మరియు రవి వ్యవహారించారు. ఈ కార్యక్రమాన్ని స్టూడెంట్ కోడింగ్ క్లబ్ సభ్యులు, ప్రవల్లిక ,అంజలి, ఆకృతి, గోపీ చంద్, కార్తికేయ , శైలజ, రేవంత్, అధినాయక, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్లు జి. సంధ్యా రాణి మరియు పి. సతీష్ కుమార్ చురుకుగా, సమర్ధవంతంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ వి. చిన్నయ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అయేషా తరుణం, డీన్ డాక్టర్ డి. శ్రీనివాసరావు, ఏవో. డాక్టర్ ఫరీద్ బాబా, డాక్టర్ పి.హరి ప్రసాద్ గారు మరియు వివిధ విభాగాల అధిపతులు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో సంక్రాంతి సంబరాలు



ఖమ్మం సూర్య ఎడ్యుకేషన్ న్యూస్ ఖమ్మం జిల్లా మామిళ్లగూడెం శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులందరూ సాంప్రదాయ దుస్తులు ధరించి అందరినీ ఆకట్టుకున్నారు. చిన్నారులకు భోగి పళ్ళు పోసి ఉపాధ్యాయులు ఆశీర్వదించారు. బొమ్మల కొలువు, ముగ్గుల పోటీలు, భోగిమంట, కోలాటాలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ శ్రీ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, ఏజిఎం చేతన్, ప్రిన్సిపల్ నీరజ , ప్రైమరీ కోఆర్డినేటర్ పార్వతి, పిపిటి కోఆర్డినేటర్ గౌతమి, హై స్కూల్ డీన్ ఉమా, ప్రైమరీ ఇన్చార్జి రేణుక, ప్రీ ప్రైమరీ ఇన్చార్జి గీత మరియు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.





# సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యం







### భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

### తెలంగాణకు రావలసిన ప్రతి నీటి బొట్టును కాపాడుకుంటాం

### డిస్ట్రిబ్యూటరీ కెనాళ్లు పూర్తిచేస్తే ఈ ఏడాదిలోనే కొన్ని నియోజకవర్గాలకు సాగునీరు

### వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**దమ్మపేట,సూర్య(మేజర్ న్యూస్) -** సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును వేగవంతంగా పూర్తి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రానికి గోదావరి, కృష్ణ నదుల నుంచి రావలసిన ప్రతి నీటి బొట్టును కాపాడుకుంటామని ఆయన అన్నారు.శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట మండలం గండుగులపల్లి గ్రామంలో సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు సంబంధించిన నాలుగవ పంప్ హౌస్ పనుల పురోగతిని, అలాగే మొత్తం ప్రాజెక్టు పనుల స్థితిగతులపై భారీ నీటిపారుదల శాఖ అధికారులు, కాంట్రాక్టర్లతో కలిసి మంత్రులు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక, ఆర్థిక వివరాలను మంత్రులకు వివరించారు.అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పురోగతిపై స్థానిక శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించామని తెలిపారు. గోదావరి నదిలో తెలంగాణ రాష్ట్రానికి మొత్తం 968 టీఎంసీల నీటి వాటా కేటాయించబడిందని, నీటి లభ్యత 75 శాతం దాటిన తర్వాత సీతారామ ప్రాజెక్టుకు అవసరమైన అన్ని అనుమతులు లభించాయని చెప్పారు. తాగునీటి అవసరాలను కూడా ప్రత్యేకంగా లెక్కగట్టి ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తున్నామని వివరించారు.గత ప్రభుత్వ హయాంలో పూర్తయ్యే అవకాశమున్న సాగునీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసి కొత్త ప్రాజెక్టులు ప్రారంభించడం వల్ల రాష్ట్రానికి తీవ్ర నష్టం జరిగిందని విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రూ.19,324 కోట్ల వ్యయంతో సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును వేగంగా పూర్తి చేయడానికి చర్యలు చేపట్టిందన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సుమారు 6 లక్షల 74 వేల ఎకరాల ఆయకట్టుకు గోదావరి జలాలు అందించనున్నట్లు తెలిపారు.భూసేకరణను ప్రధాన లక్ష్యంగా తీసుకుని వచ్చే ఆరు నెలల్లో భూసేకరణ కోసం రూ.5,000 కోట్ల నిధులను విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. భూసేకరణ పూర్తయిన వెంటనే రైతులకు ఎలాంటి ఆలస్యం లేకుండా పరిహారం చెల్లిస్తామని స్పష్టం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మార్గదర్శకత్వంలో గోదావరి, కృష్ణ నదులపై తెలంగాణకు రావలసిన నీటి వాటా పరిరక్షణ కోసం అన్ని స్థాయిల్లో సమర్థవంతమైన పోరాటం కొనసాగుతోందన్నారు. కృష్ణ వాటర్ ట్రిబ్యునల్, కేంద్ర ప్రభుత్వం, సుప్రీంకోర్టు సహా అన్ని వేదికలపై తెలంగాణకు రావలసిన ఒక్క చుక్క నీటినీ వదులుకోబోమని స్పష్టం చేశారు.అదేవిధంగా పోలవరం, నల్లమల్ల సాగర్ ప్రాజెక్టు విషయంలో తెలంగాణకు నష్టం కలిగించే ఏ అంశాన్నీ అంగీకరించబోమని, ఈ విషయమై కేంద్ర ప్రభుత్వానికి, సంబంధిత బోర్డులకు, సుప్రీంకోర్టుకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వ అభ్యంతరాలను తెలియజేశామని మంత్రి తెలిపారు. తెలంగాణ ప్రజలకు న్యాయం జరిగే వరకు, రాష్ట్రానికి రావలసిన ప్రతి నీటి బొట్టును కాపాడుకునే వరకు ప్రభుత్వం నిరంతరం పోరాటం చేస్తుందని ఆయన పేర్కొన్నారు.ఈ సమీక్ష సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ మొదటి ప్రాధాన్యంగా పినపాక, కొత్తగూడెం, అశ్వరావుపేట, వైరా, సత్తుపల్లి నియోజకవర్గాలకు సంబంధించిన డిస్ట్రిబ్యూటరీ కెనాళ్ల పనులు పూర్తిచేస్తే, ఈ ఏడాదిలోనే కొన్ని ప్రాంతాలకు సాగునీరు అందించే అవకాశం ఉందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరిన విధంగా డిస్ట్రిబ్యూటరీ కెనాళ్ల నిర్మాణానికి సుమారు రూ.4,000 కోట్ల రివైజ్డ్ అంచనాలకు అనుమతి లభించడంతో, టెండర్లు, బిల్లుల ప్రక్రియలు వేగంగా సాగుతున్నాయని చెప్పారు.గతంలో కేవలం మెయిన్ కెనాల్‌కే అనుమతులు ఉండటంతో డిస్ట్రిబ్యూటరీ కెనాళ్లు ప్రాజెక్టులో భాగంగా లేవని గుర్తు చేశారు. మంత్రుల స్థాయిలో నిరంతర ఒత్తిడి తీసుకురావడం వల్ల మొదటి మూడు పంప్ హౌసులు ప్రారంభానికి రావడంతో పాటు, 18 లింక్ కెనాళ్లు, రాజీవ్ కెనాల్ ద్వారా వైరా ప్రాజెక్టుకు నీళ్లు అందించే స్థాయికి పనులు చేరుకున్నాయని తెలిపారు. దీని ద్వారా ఇప్పటికే కొంత స్థిరీకరణ సాగునీరు అందించే అవకాశం ఏర్పడిందన్నారు.ఈ ఏడాది జూన్--జూలై నాటికి సత్తుపల్లి ట్రంక్ పనులు పూర్తిచేసి సత్తుపల్లి మండలాలకు నీళ్లు అందించాలన్న లక్ష్యంతో అధికారులు పనిచేయాలని సూచించారు. వచ్చే ఏడాదికి సంబంధించి నాలుగవ పంప్ హౌస్‌తో పాటు డిస్ట్రిబ్యూటరీ కెనాళ్లను కూడా పూర్తి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ క్రమంలో సత్తుపల్లి ట్రంక్, నాలుగవ పంప్ హౌస్ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని కొత్తగూడెం జిల్లా కలెక్టర్‌ను కోరారు.అదేవిధంగా జూలూరుపాడు పనులు పూర్తిచేసి పాలేరు నియోజకవర్గానికి లింక్ కెనాల్ ద్వారా నీళ్లు అందించేలా చర్యలు తీసుకోవాలని, ఎన్టీఆర్ కెనాల్ లింక్ కెనాల్ పనులు పూర్తైతే సత్తుపల్లి నియోజకవర్గానికి పూర్తిస్థాయిలో సాగునీరు అందుతుందని తెలిపారు. ప్రాజెక్టు పనుల సందర్భంగా రైతులకు ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే మంత్రులు, జిల్లా కలెక్టర్‌తో సమన్వయం చేసుకుని భూసేకరణ సమస్యలు లేకుండా పరిష్కరించాలని శాసనసభ్యులను కోరారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో, శాసనసభ్యులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ఎలాంటి ఆలస్యం లేకుండా సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును పూర్తి చేయాల్సిన బాధ్యత తీసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. అనేక పని ఒత్తిళ్లు ఉన్నప్పటికీ సీతారామ ప్రాజెక్టుపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ఈ సమీక్ష సమావేశానికి హాజరైన భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శాసనసభ్యుల తరపున, జిల్లా ప్రజల తరపున, రైతాంగం తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సమీక్ష సమావేశంలో అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ, సత్తుపల్లి శాసనసభ్యులు మట్టా రాగమయి, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, అటవీ శాఖ అధికారి కృష్ణ గౌడ్‌తో పాటు భారీ నీటిపారుదల శాఖ, వ్యవసాయ శాఖలకు చెందిన సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్లర్క్ ఇమామ్ ఆకస్మికమృతి

**ఇల్లందు ఆర్‌సి, సూర్య (మేజర్‌న్యూస్) -** ఇల్లందు ప్రభుత్వ డిగ్రీ కళాశాల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వైవీ హెచ్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రంలో క్లర్క్‌గా పనిచేస్తున్న షేక్ ఇమామ్ తీవ్ర అనారోగ్యానికి గురై హైదరాబాదులోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు.వార్త తెలియగానే కళాశాల ప్రిన్సిపల్ ఇమామ్ మరణానికి సంతాపం తెలియజేస్తూ ఇల్లందు పరిసర ప్రాంతాల్లో దూరవిద్యను అభ్యసించేటువంటి విద్యార్థులందరికీ ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ కళాశాలలో జరిగే ప్రతి కార్యక్రమంలో చురుకుగా పాల్గొంటూ పాల్గొనే ఇమామ్ మరణవార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని, వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని తెలియజేస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపంను ప్రిన్సిపల్, అధ్యాపక బృందం తెలియజేశారు.



# గొల్లగూడెం ఆశ్రమ పాఠశాలలో ఘనంగా సంక్రాతి వేడుకలు

**దమ్మపేట,సూర్య(మేజర్ న్యూస్) -** మండలపరిధిలోని దుర్గం గొల్లగూడెంలో ఉన్న ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భోగి పండుగను పురస్కరించుకొని పాఠశాల ప్రాంగణంలో భోగి మంటలు వెలిగించారు.ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిహెచ్ చంద్రకళ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్రాంతి పండుగ మన సంప్రదాయాలను, సంస్కృతిని ప్రతిబింబించే ముఖ్యమైన పండుగ అని, ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఐక్యతను, సంస్కారాలను పెంపొందిస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని భోగి పండుగ ప్రాముఖ్యతను తెలుసుకున్నారు. భోగి మంటల కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య విజయవంతంగా ముగిసింది.





# సంతాన వేణుగోపాల స్వామిని దర్శించుకున్న గుండెపుడి భక్త బృందం

**జూలూరుపాడు, సూర్య(మేజర్ న్యూస్) -**మండలంలోని గుండెపుడి గ్రామానికి చెందిన భక్తులు శుక్రవారం కాకర్ల గ్రామంలోని పాలగుట్టపై స్వయంభుగా వెలసిన రుక్మిణి సమేత శ్రీ సంతాన వేణుగోపాల స్వామి ఆలయానికి పాదయాత్రగా వెళ్లారు. ధనుర్మాసం సందర్భంగా గుండెపుడి గ్రామంలోని శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయం నుండి కాకర్ల గ్రామంలో పాలగుట్టకు వెళ్ళి సంతాన వేణుగోపాల స్వామి వారిని దర్శించుకున్నారు.ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొనడం జరిగిందని భక్త బృందం తెలిపారు. ఈ కార్యక్రమంలో జవ్వాజి శ్రీనివాసరావు, గాదె కృష్ణయ్య, జవ్వాజి వీరరాఘవులు, వేల్పుల గోపాలకృష్ణ,చింతకాయల శ్రీను, మద్దెబోయిన నరసింహారావు, మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# నవీన్ యాదవ్ ను మర్యాదపూర్వకంగా కలిసిన యాదవ సంఘం కట్టా శివ...



**అన్నపురెడ్డిపల్లి, సూర్య (మేజర్‌న్యూస్)-** యాదవ సంఘం నుండి రాష్ట్రంలో ఎంతో మంది రాజకీయ నాయకులుగా ఎదిగారని, కానీ చిన్న వయస్సులోనే జూబ్లీహిల్స్ శాసన సభ్యులుగా నవీన్ యాదవ్ విజయం సాధించడం యాదవ జాతికి ఎంతో గర్వకారణం అని యాదవ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ,కాంగ్రెస్ నాయకులు కట్టా శివ అన్నారు. ఉప ఎన్నికల్లో బారి విజయం సాధించిన నవీన్ యాదవ్‌ను హైద్రాబాద్‌లో ఆయన నివాసంలో శుక్రవారం జిల్లా యాదవ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లో యువత ముందుకు వచ్చి పోరాడాలని,వారికి ఎప్పుడూ నా అండదండలు ఉంటాయని, కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ఎన్నో పథకాలు పేద ప్రజల కోసం అమలు చేస్తుందని, వాటన్నింటినీ ప్రజల్లోకి తీసుకువెళ్ళి మళ్ళీ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి వచ్చే విధంగా ప్రతి కార్యకర్త పని చేయాలన్నారు. నూతన మండలం అన్నపురెడ్డిపల్లి నుండి వచ్చి అభినందలు తెలియజేసినందుకు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. నవీన్ యాదవ్‌ను కలిసిన వారిలో మండల యాదవ నాయకులు నూనె లక్ష్మణరావు, కట్టా సాయి, తదితరులు ఉన్నారు.

# మార్గదర్శినిలో ఘనంగా సంక్రాంతి వేడుకలు

### సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి

### ఆకట్టుకున్న రంగవల్లులు, కైట్స్ ఫెస్టివల్



**ఇల్లందు ఆర్‌సి, సూర్య (మేజర్ న్యూస్)–** ఇల్లందులో సంక్రాంతి శోభ వ ం ం ం ద్ స్ ం్త గా ా స ే వచ్చేసింది..పాఠశాలలకు సెలవులు కావడంతో వివిధ పాఠశాలల్లో విద్యార్థులకు రంగవల్లు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విద్యార్థినులు సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడేలా వస్త్రాలంకరణలతో ముగ్గుల పోటీలో పాల్గొన్నారు. వివిధ రంగవల్లులతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. అంతేకాకుండా కైట్స్ ఫెస్టివల్ లో భాగంగా విద్యార్థులు పతంగులను ఎగురవేస్తూ ఎంజాయ్ చేశారు. పట్టణంలోని మార్గదర్శిని పాఠశాలలో ముగ్గుల పోటీ లో పాల్గొన్న విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ,తృతీయ బహుమతులను అందజేశారు. విద్యార్థులు పండుగల విశిష్టతలను తెలుసుకునేలా పాఠశాలలో కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు పాఠశాల డైరెక్టర్లు మాజీ మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు,యాదగిరి రాంబాబు, అర్వపల్లి రాధాకృష్ణ తెలిపారు.

# జె.ఎల్ ఫౌండేషన్ సహకారంతో సుందరంగా మారిన పాఠశాల






**ములకలపల్లి,సూర్య (మేజర్ న్యూస్)–** తన గ్రామంలోని పాఠశాల విద్యార్థులకు సృజనత్మాకంగా తీర్చిదిద్దేవిధంగా ఉండాలని కోరుకున్న నూతన సర్పంచ్ తుర్రం శ్రీనివాసరావు మండలపరిధిలోని ఎం.పి.పి.ఎస్ రాజీవ్ నగర్ కాలనీ పాఠశాల భవనాన్ని హైదరాబాద్, జె.ఎల్ ఫౌండేషన్ సహకారంతో రంగుల రత్నాల మార్చారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిధి గా పాల్గొన్న నూతన సర్పంచ్ తుర్రం శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ గణప సాయిబాబా, గౌరవ అతిధిగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షలు తాండ్ర ప్రభాకర్, ఇందిరమ్మ గ్రామ కమిటీ అధ్యక్షలు డాక్టర్ వెంకటేశ్వర్లు, గ్రామ పెద్దలు గౌరి నాగేశ్వరరావు, జె.ఎల్ ఫౌండేషన్ కన్వీనర్ (హెచ్. ఎం తిమ్మంపేట) బి.శంకర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా అతిధులు మాట్లాడుతూ నూతన సర్పంచ్ తాను అనుకున్నదే పనిగా జె.ఎల్ ఫౌండేషన్ హైదరాబాద్ తెలంగాణ వారిని సంప్రదించి పాఠశాల భవనాన్ని రంగుల రత్నంల మార్చి నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. అలాగే విద్యార్థుల అవసరానికి గుర్తించి భోజనం ప్లేట్లు, నోట్ బుక్స్, పెన్స్ అండ్ పెన్సిల్స్, అంగన్ వాడి విద్యార్థులకు స్లైట్స్ జెఎల్ ఫౌండేషన్ ద్వారా అందించారు.

### నూతన ఒరవడికి శ్రీకారం..ప్రధానోపాధ్యాయులు బి.రాజువల్

తమ పాఠశాల గతంలో కంటే ఇప్పుడు చాలా సుందరంగా, విద్యార్థులను ఆకర్షించే విధంగా ఉందని, విద్యను అభ్యసించటానికి వీలుగా ఉందని, వచ్చే విద్య సంవత్సరం అడ్మిషన్స్ రెట్టింపు చేస్తానని ప్రధానోపాధ్యాయులు బి.రాజువల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరేష్, ఆనందపురం హెచ్. ఎం రాధాకృష్ణ, గ్రామ పెద్దలు, సోయం నాగరాజు, గోపి, నరేష్, కేశవరావు, భాస్కరరావు, మహేష్, అంగనవాడి టీచర్ రాజేశ్వరి, యువత, తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ రఘురాం రెడ్డికి మొక్క అందజేసిన నైనిక రజువా



**కొత్తగూడెం,సూర్య (మేజర్ న్యూస్) –** కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని రామవరంలో శుక్రవారం నిర్వహించిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశానికి ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామ సహాయం రఘురాం రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రకృతి హరిత దీక్షకురాలు, కొత్తగూడెం సెయింట్ మేరీస్ పాఠశాల విద్యార్థిని నైనిక రజువా ఎంపీకి మొక్కను అందజేశారు. చిన్న వయసులోనే పర్యావరణ పరిరక్షణ కోసం నైనిక చేస్తున్న కృషి గురించి ఎంపీ అడిగి తెలుసుకుని ఆమెను అభినందించారు.అనంతరం నైనిక రజువాను జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షరాలు తోట దేవి ప్రసన్న ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షరాలు తోట దేవి ప్రసన్న, కాంగ్రెస్ పార్టీ యువ నాయకురాలు ఆకునూరి సుప్రియ, కాంగ్రెస్ నాయకులు ఆళ్ల మురళి, గంట గోపయ్య, మోహన్, ప్రకృతి హరిత దీక్ష సభ్యులు గౌస్ తదితరులు పాల్గొన్నారు.

# ఆద్యంతం.. ఉత్కంఠ భరితం

### దూసుకుపోతున్న తెలంగాణ జట్టు

### మూడవ రోజుకు చేరిన జాతీయ కబడ్డీ పోటీలు

### కీలక దశకు చేరుకున్న మ్యాచ్‌లు



**మణుగూరు ఆర్ సి/పినపాక,సూర్య (మేజర్ న్యూస్) –** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏడూళ్ల బయ్యారం హైస్కూలు ఆవరణలో జరుగుతున్న జాతీయస్థాయి అండర్–17 బాలుర కబడ్డీ పోటీలు ఆద్యంతం ఉత్కంఠ భరితంగా కోనసాగుతున్నాయి.ప్రతి మ్యాచ్‌లోనూ పోటీ తీవ్రత కనిపించగా, చివరి నిమిషాల వరకూ ఫలితం తేలని హెూరాహెూరీ పోటీలు జరుగుతున్నాయి.శుక్రవారం జరిగిన మ్యాచ్‌లలో మొదటి మ్యాచ్లో మణిపూర్ పై ఆంధ్రప్రదేశ్ జట్టు 59–37 స్కోర్ తోవిజయం సాధించింది.రెండో మ్యాచ్లో పుదుచ్చేరి పై సీబీఎస్ఈ జట్టు 54–29 స్కోర్ తో విజయం సాధించింది. మూడవ మ్యాచ్లో బీహార్ పై తెలంగాణ జట్టు 56–33 స్కోర్ తో విజయం సాధించింది. నాలుగో మ్యాచ్లో ఒడిస్సా పై మధ్యప్రదేశ్ జట్టు 44–42 స్కోర్ తో, ఐదో మ్యాచ్లో మహారాష్ట్ర పై జమ్మూ కాశ్మీర్ జట్టు 33–96 స్కోర్ తో విజయం సాధించాయి. ఆరో మ్యాచ్లో సీబీఎస్ఈ వెల్ఫేర్ పై మహారాష్ట్ర జట్టు 77–41 స్కోర్ తో విజయం సాధించగా..ఏడో మ్యాచ్లో ఛత్తీస్గఢ్ పై రాజస్థాన్ 38–37 స్కోర్ తో విజయం సాధించింది.ఎనిమిదవ మ్యాచ్లో హర్యానాపై విద్యా భారతి జట్టు 27–41స్కోర్ తో విజయం సాధించింది. తొమ్మిదో మ్యాచ్లో చండీగఢ్ పై ఎస్వీఎస్ జట్టు 59–31స్కోర్ తో గెలిచింది. మధ్యాహ్నం జరిగిన మ్యాచ్లో మొదటి మ్యాచ్లో జార?ండ్ పై త్రిపుర 42–48 స్కోర్ తో , రెండో మ్యాచ్లో సీబీఎస్ఈ పై పశ్చిమ బెంగాల్ 55–35 స్కోర్ తో విజయం సాధించాయి. మూడో మ్యాచ్లో చండీగఢ్ పై పంజాబ్ 98–76 స్కోర్ తో వి జ య ్ ం ం సాధించింది.నాలుగో మ్యాచ్లో ఢిల్లీపై గుజరాత్ 34–32 స్కోర్ తో విజయం సాధించింది.ఐదో మ్యాచ్లో హిమాచల్ ప్రదేశ్ పై కేరళ జట్టు37–40 స్కోర్ తో విజయం సాధించింది.ఐదో మ్యాచ్లో ఉత్తరాఖండ్ పై ఉత్తరప్రదేశ్ జట్టు 34–44 స్కోర్ తో విజయం సాధించింది. ఆరో మ్యాచ్లో అస్సాంపై కె వి ఎస్ జట్టు 45–49స్కోర్ తో విజయం సాధించగా, ఏడో మ్యాచ్లో ఒడిస్సా బై ఎన్వీఎస్ జట్టు 50–36 స్కోర్ తో విజయం సాధించాయి.ముడవరోజు ఆటలో కొందరు ఆటగాళ్లు సూపర్ రైడ్స్‌తో జట్టుకు కీలక పాయింట్లు అందించగా, మరికొందరు అద్భుతమైన టాకిల్స్‌తో ప్రత్యర్థి జట్లను కట్టడి చేశారు.ముఖ్యంగా నాకౌట్ దశకు చేరుకునే జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లు ఉత్కంఠను మరింత పెంచాయి.ఈ వేదిక ద్వారా జాతీయ స్థాయిలో ప్రతిభావంతులైన క్రీడాకారులు వెలుగులోకి వస్తారని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు.రాబోయే రెండు రోజుల్లో జరిగే కీలక మ్యాచ్‌ల కోసం క్రీడాభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.





# సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుడికి కుటుంబానికి న్యాయం చేయాలి

### సింగరేణి కాంటాక్ట్ కార్మిక సంఘం సీఐటీయూ నేత భూక్య రమేష్ డిమాండ్

### ప్రమాదంలో మరణించిన సింగరేణి కాంట్రాక్టు కార్మికుడి కుటుంబాన్ని పరామర్శ



**కొత్తగూడెం సింగరేణి,సూర్య (మేజర్ న్యూస్)–** ఇటీవల ద్విచక్ర వాహన ప్రమాదంలో మరణించిన సింగరేణి కాంట్రాక్టు కార్మికుడు గోగ్గల పెద్దిరాజు కుటుంబాన్ని ఆదుకోవాలని సిఐటియు నాయకుడు భూక్య రమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం పాత కొత్తగూడెం కాలనిలోని పెద్దిరాజు నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని సింగరేణి అధికారులకు డిమాండ్ చేశారు. ప్రతి కార్మిక కుటుంబానికి సీఐటీయూ యూనియన్ ఎల్ల వేళల అండగా నిలబడతామన్నారు. పెద్దిరాజు కుటుంబ సభ్యులను, సతీమణి రేష్మ ను సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం సిఐటియు నాయకులు పరామర్శించి ధైర్యాన్ని చెప్పారు. గొగ్గల పెద్దిరాజు కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతిని తెలియజేసి సంతాపాన్ని ప్రకటించారు ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో సిఐటియు నాయకులు మాట్లాడుతూ గొగ్గల పెద్దిరాజు స్థానంలో అతని భార్య రేష్మ కు ఉద్యోగం ఇవ్వాలని సింగరేణి అధికారులు కోరారు.ఆ కుటుంబానికి సింగరేణి యాజమాన్యం చొరవ తో బ్యాంకు తరపున ఇన్సూరెన్స్ డబ్బులు వచ్చేలా సింగరేణి అధికారులు కృషి చేయాలని డిమాండ్ చేశారు. పెద్దిరాజు అకాల మృతికి తీవ్ర సంతాపాన్ని తెలిపారు. పరామర్శించిన వారిలో సిఐటియు నాయకులు బానోతు మంగీ లాల్, స్థానిక యువకులు, సింగరేణి కాంట్రాక్టు కార్మికులు ఉన్నారు.



# జడ్పీఎస్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు






### పాఠశాల విద్యార్థులకు ముగ్గుల పోటీ నిర్వహణ

**జూలూరుపాడు,సూర్య(మేజర్ న్యూస్) –** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలొ ముందస్తుగా సంక్రాంతి సంబరాలను నిర్వహించారు.పాఠశాలకు శనివారం నుంచి సంక్రాంతి పండగ సెలవులు ఉండడంతో శుక్రవారం పాఠశాల ఇన్ఛార్జ్ ప్రధానోపాధ్యాయురాలు ఎన్ ఉమా ఆధ్వర్యంలో విద్యార్థులకు ముగ్గుల పోటీ నిర్వహించి బాలికలకు బహుమతులు అందచేసారు.ముందస్తు సంక్రాంతి సంబరాల్లో భాగంగా పాఠశాలలో గాలిపటాలు ఎగురవేసారు.అనంతరం పాఠశాల ఆవరణంలో భోగిమంటలు వేసి విద్యార్థినీ విద్యార్థులతో పాటు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు ముందస్తు సంక్రాంతి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.ఎన్ ఉమా మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు సమిపిస్తున్నాయని, సంక్రాంతి సెలవులలో ఇంటి వద్ద ఉండి చదువుకోవాలని, సెలవులను కుటుంబసభ్యులతో గడిపి పాఠశాల తిరిగి పునఃప్రారంభం రోజున తప్పకుండా పాఠశాలకు హాజరుకావాలని కోరుతూ ముందస్తు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శాంతకుమారి, వెంకటేశ్వర్లు, రామనాథం, ఉమామహేశ్వరి, సర్దార్ వల్లభాయ్ పటేల్, బోడా కృష్ణ, సునీత, లలిత, జివిఆర్ ప్రసాద్, శకుంతల, ఉపేంద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సూర్య
www.suryaa.com
శనివారం 10, జనవరి, 2026

# సాటి మనిషికి సాయం చేయడంలో ఉండే తృప్తి అమోఘం

### జమతేఇస్లామీ హింద్.ముహమ్మద్ మాజీద్ రబ్బా ని



కొత్తగూడెం,సూర్య (మేజర్ న్యూస్)- మానవ సేవే మాధవ సేవ అని సాటి మనిషికి ఎంతో కొంత సహాయం చేయాలని జమాతే ఇస్లామి హింద్ రుద్రంపూర్, రామవరం శాఖ అధ్యక్షుడు రబ్బానీ అన్నారు. చుంచుపల్లి మండలం రుద్రంపూర్ గ్రామపంచాయతీ లో ప్రతి గురువారం జరిగే సంతలో సంస్థ తరుపున పండ్లు కూరగాయలు అమ్ముకునే వాళ్ళకు సంస్థ తరుపున వేడి వేడి టీ నుంచి అందిస్తున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉడుతా భక్తి గా సంస్థ తరుపున చలి నుంచి కాస్త ఉపశమనం కలిగించడానికి సంస్థ తరుపున సుమారు 120 మందికి టీ పంపిణి చేస్తున్నట్లు తెలిపారు.అనంతరం వ్యాపారస్తులు మాట్లాడుతూ ఈ చలిలో డబ్బులు పెట్టి తాగాలి అని ఉన్న వ్యాపార బిజీ వల్ల సాధ్యం కాదని, జమాత్ సభ్యులు ప్రతి వారం టీ అందిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు అబ్దుల్ బాసిత్, ముహమ్మద్ షమీం, ముహమ్మద్ మదార్ సాహెబ్, మన్నాన్, మదర్ థెరీసా సేవా సంస్థ అధ్యక్షుడు గూడెల్లి యాకయ్య, అజీం తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

### జిల్లా మహాసభ అధ్యక్షులు దారా రమేష్



కొత్తగూడెం,సూర్య (మేజర్ న్యూస్) - తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ స్టేట్ ప్రెసిడెంట్ అమరవాది లక్ష్మనారాయణ ఆదేశాల ప్రకారం గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆర్యవైశ్య మహాసభ జిల్లా కార్యాలయంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు ధారా రమేష్ ఆధ్వర్యంలో క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దారా రమేష్ మాట్లాడుతూ జిల్లా ప్రజలందరికీ నూతన సంవత్సర,సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దీవెనలతో సుఖ సంతోషాలతో జీవించాలని కోరారు.ఈ కార్యక్రమంలో రిటైర్డ్ లెక్చరర్ చారు గుండ్ల వెంకట నాగేశ్వరరావు, గేల్లా జగన్నాథం, పసుమర్తి అనంతం, వెచ్చా శ్రీరాములు, కొయ్యాడ నగేష్, బిక్కుమల్ల శ్రీనివాసరావు, వల్లాల శ్రీనివాస్, దారా ధీరజ్ ,బలరాం, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు వరం సీఎం సహాయనిధి

### ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి

### 25 మందికి రూ.7, లక్షల 65,వేలు విలువ చేసే చెక్కులు పంపిణీ



చుంచుపల్లి,సూర్య(మేజర్ న్యూస్) - పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక వరం అని, పేద కుటుంబాలు దరఖాస్తు చేసిన వెంటనే సీఎం నిధులు మంజూరు చేస్తున్నామని, పార్టీలకు అతీతంగా సహాయం కోరిన ప్రతి ఒక్కరికి సాయం మంజూరు అవుతుందని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి అన్నారు. శుక్రవారం ప్రైవేట్, కార్పొరేట్ హాస్పిటళ్లలో అత్యవసర వైద్య సేవలు పొందిన పేద మధ్యతరగతి ప్రజానీకాన్ని ఆదుకునేందుకు ఎంపీ ఆర్ఆర్ఆర్ సిఫారసుతో ముఖ్యమంత్రి సహాయ నిధి( సీఎంఆర్ఎఫ్) 25 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.7, లక్షల 65,వేలు విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులను విద్యానగర్ కాలనీలోని రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దేవీ ప్రసన్న, తదితరులుతో కలిసి ఎంపీ రఘురాం రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ లబ్ధి చేకూరేలా, ఆరోగ్య భరోసా లభించేలా కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి సహాయనిధి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్య రాంబాబు, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చీకటి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# ఇన్ సర్వీస్ టీచర్ల టెట్, సిపిఎస్‌ను రద్దు చేయాలి

### టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జోగ రాంబాబు



ఆళ్లపల్లి సూర్య (మేజర్ న్యూస్) - ఆల్ ఇండియా జాయింట్ యాక్షన్ కమిటీ ఆఫ్ టీచర్స్ ఆర్గనైజేషన్(ఏఐజేఏసిటీఓ) పిలుపులో భాగంగా యూఎస్పిసి,టిపిటిఎఫ్ పిలుపు మేరకు పాఠశాలలో తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ ఆళ్ళపల్లి మండలశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాల మర్కోడులో ఆశ్రమ గర్ల్స్ హైస్కూల్ అనంతోగులో ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు నిర్వహించే ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ ను రద్దు చేయాలని, సిపిఎస్ ను రద్దుచేసి ఓపిఎస్ ను పునరుద్ధరించాలని,న్యూ ఎడ్యుకేషన్ పాలసీ-2020 ను రద్దు చేయాలని,టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలలో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు ఓటు హక్కు కల్పించాలని నినదీస్తూ నిరసన తెలపడం జరిగింది. ఈ సందర్భంగా టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జోగ రాంబాబు మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా సర్వీసు చేసిన ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ రాసి రెండు సంవత్సరాలలో ఉత్తీర్ణులు కావాలని లేని యెడల ఉద్యోగం నుండి తొలగిస్తామని చెప్పడం సరైనది కాదని,ఉద్యోగ నియామక నోటిఫికేషన్లలో పేర్కొన్న విద్యార్హతల ప్రకారమే ఉద్యోగాలు పొందినప్పటికీ ఇప్పుడు కొత్తగా టెట్ పరీక్ష రాయాలని,లేనియెడల ఉద్యోగం నుండి తొలగిస్తామని చెప్పడం సరైనది కాదని,ఇటువంటి నిర్ణయాలను వెంటనే విరమించుకోవాలని చెప్పారు. విద్యా హక్కు చట్టం 2009కి తరువాత నియమించబడిన ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయించాలని,అందుకు తగినట్టుగా విద్య హక్కు చట్టాన్ని అమెండ్మెంట్ చేయాలని కోరారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు నష్టం కలిగించే సిపిఎస్‌ను రద్దు చేసి ఓపిఎస్ ను పునరుద్ధరించాలని, న్యూ ఎడ్యుకేషన్ పాలసీ 2020 రద్దు చేయాలని అన్నారు.ప్రస్తుతం ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరూ ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నందున అందరికీ టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటు హక్కు కల్పించాలన్నారు. పై డిమాండ్ల సాధన కొరకు రేపు ఉపాధ్యాయులందరము ఈ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మెమొరాండాన్ని రాష్ట్రపతి, ప్రధానమంత్రికి సమర్పిస్తామని, అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఈ డిమాండ్లను పరిష్కరించకపోతే ఫిబ్రవరి 5న జరగబోయే చలో ఢిల్లీ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనబోతున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో టిపిటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఈసం ముత్తయ్య, ప్రధానోపాధ్యాయులు చీమల భద్రమ్మ,మండల అధ్యక్షులుభోజ్య, నాగమణి, మమతరాణి, లీలావతి, పద్మబాయి, కృష్ణ, మోహన్ బాబు,రాంబాబు,లక్ష్మ నారాయణ,లాలయ్య,రాంబాయి అనుజ్ఞ జ్యోతి, భద్రమ్మ,కొమరం వసంత రావు,రవీందర్ బాబు, లక్ష్మయ్య, నరేష్, రాజా,నెహ్రూ,రామయ్య,చిన్న,శ్రీను రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# విబిజి రాంజీ 2025 చట్టాన్ని తప్పుదారి పట్టించేందుకు ప్రయత్నం

### ప్రతిపక్ష పార్టీలు తప్పుదారి పట్టించి ప్రయత్నం సరికాదు

### వికసిత గ్రామాలపై రూపొందించిన కొత్త చట్టం

### క్షత్రస్థాయిలో ఉపాధి కోసం ఏడాదికి 125 రోజులు పెంపు

### విలేకరుల సమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షులు బైరెడ్డి



లక్ష్మదేవిపల్లి,సూర్య(మేజర్ న్యూస్)- కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు ఉపాధి కల్పించేందుకు వీలుగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో ప్రవేశపెట్టిన భారత్ రోజుగా అవుర్ అజివిక మిషన్ గ్రామీణ వి బి జి రాంజీ 2025 చట్టాన్ని తీసుకురావడం జరిగిందని పేదలకు ఉపయోగపడే విధంగా ఉన్నాయి చట్టాన్ని తప్పుదారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్న ప్రతిపక్ష పార్టీల చర్యలు సరైనవి కాదని జిల్లా బిజెపి అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి వ్యాఖ్యానించారు. గురువారం బిజెపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.కేంద్ర ప్రభుత్వము ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో ని బీజేపీ ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టినటువంటి బిల్లు వికసిత్ భారత్ రోజ్ గార్ ఔర్ ఆజీవిక మిషన్ గ్రామీణ్ వి బి జి రాంజీ 2025 చట్టాన్ని పార్లమెంటు ఉభయ సభలు ఆమోదించిన విషయాన్ని వివరించారు. ఈ బిల్లు గ్రామీణ అభివృద్ధికి ఒక విప్లవాత్మక చట్టం వికసిత్ భారత్ నిర్మాణం కోసం వికసిత గ్రామాలకై కొత్త ఫ్రేమ్ వర్క్ ని ఈ చట్టం రూపొందించిందన్నారు.ఇప్పటివరకు ఎంజిఎన్ఆర్ నరేగా క్రింద ఉన్నటువంటి బిల్లుని పేరు మార్చడం వల్ల ప్రతిపక్షలు అసత్యాలు ప్రజలకు ప్రచారం చేస్తున్నాయని వ్యాఖ్యానించారు. అయితే వాస్తవాలు ప్రజలకు ఉపయోగపడే విధంగా ఈ యొక్క బిల్లుని రూపకల్పన చేసి ప్రజలకి క్షత్రస్థాయిలో ఉపాధి పెంపొందించడం కోసం చేసిన బిల్లు గతంలో వంద రోజులు ఉన్న టువంటి పని దినాలను 125 రోజులకు పెంచుతూ ఈ చట్టం రూపకల్పన చేయడం జరిగిందన్నారు. నిర్ణీత సమయంలో పని కల్పించ నప్పుడు నిరుద్యోగ భత్యం అందించే నిబంధనను మరింత బలోపేతం చేశారని పేర్కొన్నారు. వేతనాలు ఆలస్యంగా చెల్లిస్తే అదనపు పరిహారం చెల్లించే నిబంధన కూడా ఉందని వివరించారు. కాగా ఈ పథకాన్ని కేంద్రం స్థాయిలో మాత్రమే రూపొందిస్తారు అని పుకార్లు వ్యాప్తి చేస్తున్నారని, అయితే వాస్తవం ఏమిటంటే గ్రామపంచాయతీ, గ్రామ సభ స్వయంగా తమ గ్రామానికి సంబంధించిన అభివృద్ధి ప్రణాళికను సిద్ధం చేసి గ్రామంలో ఎలాంటి పనులు చేపట్టాలో నిర్ణయిస్తారని పేర్కొన్నారు. కాగా పేద కుటుంబాల నమోదు ఉపాధి హామీ కార్డుల జారీ పని కోసం దరఖాస్తుల స్వీకరణ పథకాలను రూపొందించటం వంటి బాధ్యతలన్నీ గ్రామపంచాయతీలపైనే ఉంటాయని వివరించారు.ఈ చట్టం కింద కనీసం 50 శాతం పనులను నేరుగా గ్రామపంచాయతీల ద్వారా అమలు చేస్తారన్నారు. ఇది స్థానికులకు పని కల్పిస్తుందని, గ్రామం స్థానిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధిని నిర్ధారిస్తుందిని, గ్రామసభ, గ్రామపంచాయతీలు తమ గ్రామ అభివృద్ధికి ప్రణాళికను రూపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ పథకం కింద నాలుగు ప్రధాన రకాల పనులు చేపడతారని అవి నీటి సంరక్షణ, మౌలిక సదుపాయాల కల్పన, జీవనోపాధి ఆధారిత పనులు, విపత్తు నిర్వహణ సంబంధించిన పనులు దీని కింద చెరువులు చెక్ డ్యాములు మరమ్మతులు చేసుకునే అవకాశం ఉందన్నారు. అంతేగాక పాఠశాలలో ఆసుపత్రులు, అంగన్వాడీలు, రోడ్లు, కాలువలు, షెడ్లు లేదా ఇతర అవసరమైన మౌలిక సదుపాయాల నిర్మాణ పనులు చేపడతారని తెలిపారు. అదేవిధంగా పేద కుటుంబాలు, స్వయం సహాయక బృందాల ఆదాయాన్ని పెంచే కార్యక్రమాలు చేస్తారని వివరించారు. అంతే కాకుండా వ్యవసాయం సీజన్ సమయం లో 60 రోజులు ఉపాధి హామీ పథకం ని విరామం ప్రకటించి రైతులకి, రైతు కూలీల సమస్య నుండి కూడా ఉపశమనంఉండేలాగా రూపకల్పన చేయడం జరిగిందన్నారు. ఇలా అన్ని విధాల గ్రామీణ ప్రజలకు ఉపయోగపడేటువంటి ఈ పథకం మీద ప్రతిపక్షలు ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసత్యాలు ప్రచారం చేస్తూ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆరోపించారు. కానీ విజ్ఞనైన ప్రజలు ఈ బిల్లులో ఉన్నటువంటి వాస్తవాలను తెలుసుకొని ప్రతిపక్షలకు తగిన బుద్ధి చెబుతారని వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో బిజెపి గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి భూక్య రవి నాయక్, లక్ష్మదేవి పల్లి మండల అధ్యక్షులు మాలోత్ గాంధీ నాయక్. చుంచుపల్లి మండల అధ్యక్షులు బలగం శ్రీధర్, బూర్గంపాడు మండల అధ్యక్షుడు సాయి శ్రీనివాస్, బిజెపి జిల్లా నాయకులు గొడుగు శ్రీధర్, జల్లారపు శ్రీనివాస్, కొత్తగూడెం పట్టణ ప్రధాన కార్యదర్శి గుంపుల మహేష్, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి ఇంటర్ రీజినల్ ఎగ్జిక్యూటివ్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు






## ప్రారంభించిన కొత్తగూడెం ఏరియా జీఎం ఎం. షాలేం రాజు

**కొత్తగూడెం సింగరేణి,సూర్య (మేజర్ న్యూస్)-** కొత్తగూడెం ఏరియాలోని రుద్రంపూర్ లో గల ప్రొఫెసర్ జయశంకర్ స్టేడియం నందు ప్రతి ఏటా నిర్వహిస్తున్న క్రికెట్ ఆఫ్ సింగరేణి ఎగ్జిక్యూటివ్ టోర్నమెంట్ లో భాగంగా శుక్రవారం సింగరేణి ఎగ్జిక్యూటివ్ లకు ఇంటర్ రీజినల్ ఎగ్జిక్యూటివ్ క్రికెట్ టోర్నమెంట్ 2025 ను కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. షాలెం రాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా, విశిష్ట అతిథులుగా జిఎం (ఫైనాన్స్) ఎం.సుబ్బారావు, జిఎం (పర్సనల్) వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ జి.వి. కిరణ్ కుమార్‌ల సమక్షంలో ప్రారంభించడం జరిగింది. ఈ టోర్నమెంట్ కు కన్వీనర్ గా కొత్తగూడెం ఏరియా ఎస్ఓటు జిఎం జి.వి. కోటి రెడ్డి వ్యవహరించడం జరుగుతుంది. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ ఈ స్నేహపూర్వక క్రికెట్ టోర్నమెంట్ ను కొత్తగూడెం ఏరియాలో నిర్వహించుకోవడం ఎంతో సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమాన్ని ఇంత బాగా ఆర్గనైజ్ చేసిన కొత్తగూడెం, కార్పొరేట్ వారికి అభినందన తెలియజేశారు. ఈ స్టేడియం నందు గత మూడు నెలలుగా కోల్ ఇండియా లెవెల్ కబడ్డీ టోర్నమెంట్, కంపెనీ లెవెల్ క్రికెట్ టోర్నమెంట్ అలాగే ఈ ఎగ్జిక్యూటివ్ క్రికెట్ టోర్నమెంట్లను నిర్వహించడం ఎంతో సంతోషకరంగా ఉందని పేర్కొన్నారు. గత మూడేళ్లుగా ఈ ఎగ్జిక్యూటివ్ క్రికెట్ టోర్నమెంట్ కొత్తగూడెం ఏరియాలో ఈ ప్రొఫెసర్ జయశంకర్ స్టేడియం, రుద్రంపూర్ వేదిక నందు నిర్వహించుకుంటున్నామని వివరించారు. ఈ టోర్నమెంట్ నిర్వహణకు అనుమతి అడిగిన వెంటనే సానుకూలంగా స్పందించి టోర్నమెంట్ నిర్వహించుకొనుటకు అనుమతించిన సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డి. కృష్ణ భాస్కర్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా కొత్తగూడెం ఏరియాలో ఈ క్రికెట్ టోర్నమెంట్ ను నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. అందుకోసమని ప్రొఫెసర్ జయశంకర్ స్టేడియమును ఇలా క్రికెట్ ఆటను ఆడుటకు వినియోగకరంగా తీర్చిదిద్దిన సంబంధిత సివిల్, ఎలక్ట్రికల్ (ఏరియా వర్క్ షాప్) వారికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ క్రికెట్ మ్యాచ్ లు ఉదయం నుండి రాత్రి వరకు నిర్వహించేలా ఏర్పాటు చేశారని రాత్రి నిర్వహిస్తున్న డే అండ్ నైట్ మ్యాచ్ లకు ఫ్లడ్ లైట్ లను అమర్చి ఆడుటకు అనుకూలమైన వసతులను చేసిన వర్క్ షాప్ ఉద్యోగులకు, అధికారులకు ప్రత్యేకంగా అభినందించారు. ఈ టోర్నమెంట్ ఈనెల 11వ తేదీ వరకు మూడు రోజులు ఉంటుందని తెలిపారు. క్రీడాకారులు(ఎగ్జిక్యూటివ్స్) ఎంత ఆనందంగా ఈ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారో అంతే ఆనందంతో చివరి రోజు వరకు కూడా ఉండాలన్నారు. దెబ్బలు తగలకుండా తగు జాగ్రత్తలతో ఆటను ఆడాలని అన్నారు. అలాగే క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహదం చేస్తాయని, ప్రతి ఒక్కరూ తప్పక శారీర శ్రమకు సమయం కేటాయించి వారి ఆరోగ్యాలను కాపాడుకోవాలని సూచించడం జరిగినది. విశిష్ట అతిథులు మాట్లాడుతూ క్రికెట్ గేమ్ ఒక టీం వర్క్ గేమ్ అని ఒక్కరు రానిస్తే గేమ్ గెలవలేరని టీం సభ్యులందరూ కలిసికట్టుగా రాణిస్తేనే వారి టీం గెలుపొందుతుందని పేర్కొన్నారు. ఇలాగే మన సింగరేణి సంస్థలో కూడా ప్రతి ఒక్కరం ఎవరికి కేటాయించిన విధులను వారు నమ్మకంగా నిర్వర్తించి రక్షణతో సమిష్టిగా సంస్థ పురోభీవృదికి తోడ్పడాలని అన్నారు. ఈ టోర్నమెంట్ నిర్వహణ 2017 సంవత్సరం నుండి జరుగుతుందని,ఈ టోర్నమెంట్లో సింగరేణి ఎగ్జిక్యూటివ్ లకు కంపెనీ లెవెల్ క్రికెట్ టోర్నమెంట్ ( క్రికెట్ ఆఫ్ సింగరేణి ఎగ్జిక్యూటివ్ టోర్నమెంట్) పాల్గొంటారని తెలిపారు. ఈ ఆటల పోటీలలో భాగంగా కొత్తగూడెం, బెల్లంపల్లి, రామగుండం రీజియన్లలో పనిచేయుచున్న అధికారులను మూడు టీములుగా, కార్పొరేట్ లో పనిచేస్తున్న అధికారులను ఒక్క టీమ్ గా మొత్తంగా నాలుగు టీములుగా కేటాయించడం జరిగిందిని వివరించారు. కొత్తగూడెం రీజియన్ నందు (కొత్తగూడెం, మణుగూరు,ఇల్లందు) ఏరియాలలో పనిచేయుచున్న ఎగ్జిక్యూటివ్ లు ఉంటారని పేర్కొన్నారు. బెల్లంపల్లి రీజియన్ నందు (బెల్లంపల్లి,శ్రీరాంపూర్, మందమర్రి) ఏరియాలలో పనిచేయుచున్న ఎగ్జిక్యూటివ్ లు ఉంటారని తెలిపారు. రామగుండం రీజియన్ నందు ( రామగుండం 1, రామగుండం 2, రామగుండం 3, భూపాలపల్లి) ఏరియాలలో పనిచేయుచున్న ఎగ్జిక్యూటివ్ లు ఉంటారని అన్నారు. మొదటిగా ముఖ్య, విశిష్ట అతిథుల సమక్షంలో టాస్ వేసి కొత్తగూడెం రీజియన్ టీం తో కార్పొరేట్ టీములకు మొదటి మ్యాచ్ టాస్ వేసి ప్రారంభించారు. మొదటి మ్యాచ్లో కొత్తగూడెం రీజియన్ టీం వారు టాస్ గెలిచి బౌలింగ్ తీసుకున్నారు. ముందుగా బ్యాటింగ్ చేసిన కార్పొరేట్ టీం 20 ఓవర్లకు 7 వికెట్లు కోల్పోయి 176 పరుగులు పరుగులు లక్ష్యన్ని నిర్దేశించారు. ఈ నిర్దేశించిన 176 పరుగుల టార్గెట్ ను కొత్తగూడెం రీజియన్ టీం వారు 20 ఓవర్లకు 9 వికెట్ల కోల్పోయి 164 పరుగులు మాత్రమే చేసి 12 పరుగుల తేడాతో ఓడిపోవడం జరిగింది. ఈ కార్యక్రమములో కొత్తగూడెం ఏరియా జిఎం తో పాటు, జిఎం (ఫైనాన్స్) ఎం.సుబ్బారావు, జిఎం (పర్సనల్) వెల్ఫేర్ డ సిఎస్ఆర్ జీవి కిరణ్ కుమార్, కొత్తగూడెం ఏరియా సీఎంఓఏఐ ప్రెసిడెంట్ ఎం.వి నరసింహారావు, కొత్తగూడెం ఏరియా ఎస్ఓటు జిఎం జివి. కోటిరెడ్డి, ఏరియా ఇంజనీర్ కే.సూర్యనారాయణ రాజు, ఏజిఎం (సివిల్) సిహెచ్. రామకృష్ణ, ఎజిఎం (పర్సనల్) జీవి మోహన్ రావు, పాలడుగు శ్రీనివాస్ ఈ టోర్నమెంట్ కు కమిటీ మెంబెర్ లు, వివిధ విభాగాధిపతులు, అధికారులు, స్పోర్ట్స్ ఆర్గనైజర్స్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీపై ప్రజలు విశ్వాసం ఉంచి గెలిపించారు

**ప్రజల సమస్యల పరిష్కారంలో రాజీ లేకుండా పనిచేయాలి**

**ప్రజా పాలనలో గ్రామస్థాయి నాయకులదే కీలకపాత్ర**

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**





**మణుగూరు ఆర్ సి/పినపాక,సూర్య (మేజర్ న్యూస్)-** ప్రజా పాలనలో గ్రామస్థాయి నాయకులదే కీలక పాత్ర అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం పినపాక మండలం ఈ బయ్యారం గ్రామంలోని జివిఆర్ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ బలపరిచి గెలుపొందిన సర్పంచులు, వార్డు మెంబర్లకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రజాప్రతినిధులను శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, గ్రామస్థాయి పాలన బలపడితేనే రాష్ట్రం సమగ్ర అభివృద్ధి సాధిస్తుందని అన్నారు. సర్పంచులు, వార్డు మెంబర్లు ప్రజలకు అతి సమీపంగా ఉండే ప్రజాప్రతినిధులని, వారి కృషి వల్లే ప్రభుత్వ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు చేరుతాయని తెలిపారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీపై ప్రజలు విశ్వాసం ఉంచి గెలిపించారంటే,అది పార్టీ విధానాలకు,నాయకత్వానికి ఇచ్చిన మద్దతుగా భావించాల్సిందిగా పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో రాజీ పడకుండా పనిచేయాలని, గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి సూచించారు. తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, విద్యుత్, విద్య, వైద్యం వంటి అంశాల్లో సర్పంచులు చొరవ తీసుకొని ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకోవాలని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణాభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని పనిచేస్తోందని, అందులో భాగంగా స్థానిక ప్రజాప్రతినిధులకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామాల్లో యువత, మహిళలు, రైతులు, పేద వర్గాల సంక్షమమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తోందని మంత్రి స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు ఎప్పటికప్పుడు ప్రజల మధ్య ఉండి వారి అవసరాలు తెలుసుకొని పరిష్కార మార్గాలు చూపాలని అన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే నిజమైన విజయమని, పదవులు తాత్కాలికమైనవని గుర్తుంచుకొని సేవాభావంతో పనిచేయాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల నాయకులు పాల్గొని మాట్లాడారు. పార్టీ బలోపేతానికి క్షత్రస్థాయిలో సర్పంచులు, వార్డు మెంబర్లు చేసిన కృషిని వారు ప్రశంసించారు. రానున్న రోజుల్లో గ్రామాల అభివృద్ధి కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పినపాక నియోజకవర్గ వ్యాప్తంగా గెలిచిన సర్పంచులు, వారి కుటుంబ సభ్యులను సన్మాన కార్యక్రమం సందర్భంగా ప్రజాప్రతినిధుల్లో ఉత్సాహం వెల్లివిరిసింది. తమపై పెట్టుకున్న బాధ్యతను మరింత నిబద్ధతతో నిర్వర్తిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బలరాం నాయక్, భద్రాచలం ఎమ్మెల్యే వెంకటరావు, అశ్వరావుపేట ఎమ్మెల్యే ఆదినారాయణ కాంగ్రెస్ సీనియర్ నాయకులు బ్రహ్మయ్య, స్థానిక కాంగ్రెస్ మండల అధ్యక్షులు రామనాథం, వందల సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు,అభిమానులు, పాల్గొన్నారు.

# సీఎండీకి 1104 డైరీ అందజేసిన యూనియన్ రాష్ట్ర నాయకత్వం..



**పాల్వంచ,సూర్య (మేజర్ న్యూస్)-** టిఈఈ 1104 యూనియన్ నూతన సంవత్సర 2026 డైరీ మరియు క్యాలెండర్లను సీఎం డి /టీజీ జెన్కో హరీష్ కి విద్యుత్ సౌదా, హైదరాబాదులో తన కార్యాలయంలో యూనియన్ రాష్ట్ర నాయకత్వం మర్యాదపూర్వకంగా కలిసి అందజేశారు. అనంతరం జన్కో డైరెక్టర్లు పి.బాలరాజు (హైడల్), బి.నగ్య (కోల్ అండ్ లాజిస్టిక్స్), జి.వీర మహేందర్ (ఫైనాన్స్, కమర్షియల్), పేషీ అధికారులకు డైరీలు అందజేశారు. ఈ సందర్భంగా జెన్కోలో పెండింగ్లో ఉన్న పదోన్నతులను తక్షణం ఏర్పాటు చేయాలని, థర్మల్ మరియు హైడల్ ప్లాంట్లకు శాంక్షన్ పోస్టు మంజూరు చేయాలని, జెపిఏ నుండి జూనియర్ అసిస్టెంట్ కన్వర్షన్ కు తక్షణం స్క్రీనింగ్ టెస్ట్ తేదీని ప్రకటించాలని కోరారు. కేటీపీ ఎస్‌లో ఉద్యోగులు బోర్డు కి హ్యాండ్వర్ చేసిన క్వాటర్లకు కనిష్ట, గరిష్ట కాల పరిమితి ప్రాతిపదికన హెచ్ ఆర్ ఏ రిలీజ్ చేయాలని తదితర డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. అదేవిధంగా వైటిపిఎస్ థర్మల్ పవర్ స్టేషన్లో స్టేజ్ 2 , ఏ హెచ్ పి అండ్ సి హెచ్ పి విభాగాలను ప్రవేట్ ఏజెన్సీలకు ఇవ్వాలనే ఆలోచన విద్యుత్ సంస్థల మనుగడకి గొడ్డలి పెట్టు లాంటిదని ఈ ఆలోచనను తక్షణం కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి.వెంకటేశ్వర్లు జి.సాయి బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ కే.రాజేందర్, జెన్కో అధ్యక్ష - కార్యదర్శులు కే.కోటేశ్వరరావు - వి.దుర్గా అశోక్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.యాసయ్య అడిషనల్ సెక్రటరీ ఏ.కుశలవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ క్యాలెండర్ డైరీల ఆవిష్కరణ




**పాల్వంచ,సూర్య (మేజర్ న్యూస్)-** తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా శాఖ ఆధ్వర్యంలో 2026వ సంవత్సరకు క్యాలెండర్ డైరీ లను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యాశాఖ అధికారి బి నాగలక్ష్మి తమ కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ డైరీ క్యాలెండర్ లు ఉపాధ్యాయులకు ఉపయోగపడే విధంగా కర దీపికగా ఉందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో ఉత్తీర్ణత శాతం పెరిగేలా కృషి చేయాలని కోరారు. ఈ డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బి రాజు, జిల్లా అధ్యక్షులు బి. మురళీమోహన్, మల్లెంపాటి వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షులు, వి వరలక్ష్మి ఎం రాజయ్య, జిల్లా కార్యదర్శులు, డి దాసు, ఎం పద్మారాణి,ఎస్కే యాకూబ్ పాషా, పాల్వంచ మండల అధ్యక్షులు యం. శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి జి హరి సింగ్, జిల్లా సోషల్ మీడియా సభ్యులు బి మంగిలాల్ తదితరులు పాల్గొన్నారు.

సూర్య
www.suryaa.com
శనివారం 10 జనవరి 2026

## బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం..

**– చితికి పోయిన వారికి బాసటగా నిలవండి..సూర్య**



**కొణిజర్ల సూర్య (మేజర్ న్యూస్)**

ఆరోగ్యంగా,మానసికశీగా, ఆర్థికంగా చితికి పోయిన వారిని ఎవ్వరైనా ముందుకు వచ్చి ఆసరాగా నిలవాలని దొంీడపాటి సూర్యచంద్ర విజ్ఞప్తి చేశారు.స్థానిక మండల కేంద్రనికి చెందిన పోతగాని శివ మృతి చెందిన విషయం తెలిసిందే,అంతే కాకుండా గత ఏడాది లో పిడుగు పాటుకు గురై మృతి చెందిన రోశీటే కనకయ్య ఇరు బాధిత కుటుంబాలకు దొండపాటి వెంకయ్య జ్ఞాపకార్థం ఆయన మనవడు దొండపాటి సూర్యచంద్ర రూ 10000,5000 చొప్పున ఆర్థిక సాయాన్ని శుక్రవారం అందించారు.. గూదె రమణ కుమార్తె దివ్యాంగురాలు కావటంతో సౌకర్యం కోసం వీల్ చైర్ ను అందించారు..ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ మనకు ఎంత వుందని కాదు మనం ఎవరికైనా తోడ్పాటు అందిస్తున్నాం లేదా!ఆరోగ్య పరంగా ఎన్నో కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతున్నారని మన కున్న దానిలో సహాయశీ చేసి వారి కుటుంబాలకు భరోసాగా నిలవాలని ఆయన కోరారు..

## ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పాటు లక్ష్యంగా ప్రచార యాత్ర

**-రెండు తెలుగు రాష్ట్రాలలో శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి సుఫల యాత్ర**

**-20 నుంచి భక్తరామదాసు జన్మస్థలం నుంచి ప్రారంభం**

**-సిద్ధార్ధ యోగ విద్యాలయం,ప్రకృతి వైద్యులు డాక్టర్.రామచంద్రరావు.**

**నేలకొండపల్లి సూర్య మేజర్ న్యూస్**

ఆరోగ్య వంతమైన సమాజం కోసం శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్స్వామి సుఫల యాత్రను రామదాసు జన్మస్థలమైన నేలకొండపల్లి నుంచి ప్రారంభించనున్నట్లు సిద్దార్ధ యోగ విద్యాలయం ప్రకృతి వైద్యులు డాక్టర్.రామచంద్రరావు పేర్కోన్నారు.స్థానిక యోగ విద్యాలయం లో శు క్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. రెండు తెలుగు రాష్ట్రాలలో సుఫల ప్రచార పాదయాత్ర ను చేపట్టనున్నట్లు తెలిపారు.రైతులు ప్రజల సంక్షమం. ఆరోగ్యవంతమైన సమాజం కోసం,కాలుష్య రహిత సారవంతమైన భూమిని కాపాడుకొని సారవంతమైన భూమిగా చేసుకోవాలని ఆయన చెప్పారు. దీనివలన మంచి పంటలు పండి ఆరోగ్యకరమైన ఆహారం లభిస్తుందని అన్నారు.భూమి బాగుండాలి...పంట బాగుండాలి. రైతు బాగుండాలి...




అవి తిన్న ప్రజా సమూహాలు బాగుండా లని లక్ష్యంతో ఏపీ తెలంగాణలో చిన్న జీయర్ స్వామి సఫలా యాత్ర చేపట్టాలని తెలిపారు.రైతుల సంక్షమం కోసం సాగిస్తున్న ఆరోగ్యం వ్యవసాయ ఉద్యమంగా ఆయన చెప్పారు.ఈ యాత్ర పరమ భక్తి గ్రేసురుడు (కంచర్ల గోపన్న) జన్మస్థలమైన నేలకొండపల్లి నుంచి ప్రారంభించినట్లు తెలిపారు.20వ తేదీన విద్యాలయంలో పాతకాలపు సాంప్రదాయపు వ్యవసాయ పరికరాలు ప్రదర్శన,కకృతి ప్రసాదించిన దివ్య ఔషధాలు అయిన దేశవాళి 150 రకాల పప్పు దినుసులు,50 రకాల సీతివృత్తుల కళారూపాల ప్రదర్శన,250 రకాల ఔషధ మొక్కల ప్రదర్శనను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.అనంతరం భక్త రామదాసు ధ్యానం మందిరం వరకు పాదయాత్రతో వెళ్లి ప్రత్యేక పూజలు చేస్తారని తెలిపారు.ఈ యాత్రలో అందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు.ఈ విలేకరుల సమావేశంలో అర్చక సంఘం జిల్లా నాయకులు తూపురాని మధుసూదనాచార్యులు ఉన్నారు.

## శ్రీ చైతన్య లో ముందస్తు సంక్రాంతి సంబరాలు







**సూర్య ప్రతినిధి ఖమ్మం**

స్థానిక మమత హాస్పిటల్ రోడ్డు నందు గల శ్రీ చైతన్య ఒలంపియాడ్ స్కూల్ నందు ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు శుక్రవారం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా శ్రీ చైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ మల్లెంపాటి శ్రీవిద్య సాయి గీతిక విచ్చేశారు. సంక్రాంతి పండుగ కేవలం ఆచారం మాత్రమే కాదు, అది మన సంస్కృతి, సంప్రదాయాలు, కుటుంబ విలువలు, ప్రకృతితో మమేకమైన జీవనశైలిని చాటిచెబుతుంది అని, తెలియజేశారు. విద్యార్థులు, సిబ్బంది వివిధ వస్త్రధారణలతో పాఠశాల అంతటా పల్లె వాతావరణం నెలకొంది. బొమ్మలకొలువు ఏర్పాటుచేసి, పిల్లలకు భోగిపళ్లు పోశారు. పాఠశాల ప్రిన్సిపల్ టి. ఎల్. యన్. శర్మ మాట్లాడుతూ, సంక్రాంతి పండుగ సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించడంతో ప్రారంభమయ్యే సౌరమాన పండుగ అనీ , ఇది ఉత్తరాయణ పుణ్యకాలానికి నాంది పలుకుతుంది, శీతాకాలం ముగిసి వసంతం ప్రారంభాన్ని సూచిస్తుందని పంటల కోతకు, కొత్త ఆశలకు ఇది ప్రతీక అనీ , కుటుంబ బంధాలను, సంప్రదాయాలను బలోపేతం చేస్తుంది అని తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాలల డి. జీ. ఎం. చేతన్ మాథుర్, కోఆర్డినేటర్ కృష్ణారావు, వైస్ ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి, డీన్స్ కె.వి. ఆర్ ,హరినాద్ రెడ్డి, ఏం. ఎస్.ఎన్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పిల్లలకు అక్షరాభ్యాసం,ఆరోగ్య పరీక్షలు

**-అంగన్వాడిలో ఆరు రకాల అభివృద్ధి ఆటపాటలతో విద్య**

**-మెడికల్ ఆఫీసర్.డాక్టర్.సనా**

**నేలకొండపల్లి సూర్య మేజర్ న్యూస్**

మండల పరిధిలోని చెరువు మాదారం గ్రామంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో మూడవ అంగన్వాడి కేంద్రంలో ఫ్రీ స్కూల్ పిల్లలకు అక్షరాభ్యాసం,ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సనా మాట్లాడుతూ... అంగన్వాడి కేంద్రంలో ఆరు రకాల అభివృద్ధిలతో తోపాటు ఆటపాటలతో విద్య ను అందిస్తున్నారాని అన్నారు.30 నెలలు కలిగిన పిల్లలను అక్షరాభ్యాసం ద్వారా అంగన్వాడిలో పేరు నమోదు చేయించుకోవాలని తల్లులకు సూచించారు.ఆరోగ్య పరీక్షల ద్వారా బరువు తక్కువ ఉన్న పిల్లలను గుర్తించి ఎన్ ఆర్ సి కి రిఫర్ చేస్తామని వెల్లడించారు. అంగన్వాడి కేంద్రాన్ని అర్హత కలిగిన పిల్లల తల్లిదండ్రులు





ఉపయోగించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్.

పార్వతమ్మ, గ్రామపంచాయతీ వార్డు మెంబర్స్,కే పుల్లయ్య, పంచాయతీ కార్యదర్శి భాషా,ఏఎన్ఎంలు, అంగన్వాడి టీచర్.కె. జానకమ్మ,ఆయా అనసూర్య,పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నట్టల నివారణ కార్యక్రమంను సద్వినియోగం చేసుకోవాలి

**నేలకొండపల్లి సూర్య మేజర్ న్యూస్**



జిల్లా లో ప్రభుత్వం చేపట్టిన గొర్రెల,మేకల కు నట్టల నివారణ కార్యక్రమం ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం జిల్లా అధ్యక్షుడు, అనాసాగారం సోసైటీ అధ్యక్షుడు ఎడ్ల తిరపతిరావు సూచించారు. మండలం లోని అనాసాగారం లో మూగజీవాలకు నట్టల నివారణ కార్యక్రమం ను చేపట్టారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ...పెంపకందారులు వృత్తి పై ఆధారపడి జీవిస్తున్న వారికి ప్రభుత్వం ఇవ్వాల్సిన ప్రోత్సాహకాలు వెంటనే అందించాలని కోరారు. పెంపంకందారులకు ప్రభుత్వం ఇచ్చిన ప్రతీ హమీ న్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.జిల్లాలో చేపట్టిన నట్టల నివారణ కార్యక్రమం లో పెంపకందారులు పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు. సీజనల్ వ్యాధులు రాకుండా పశువైద్యాధికారుల సూచనలు పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ బొడ్డు రాంబాబు,సంఘం ఉపాధ్యక్షుడు నోముల వెంకటనారాయణ, కార్యదర్శి చిర్ర రాజు తదితరులు పాల్గొన్నారు.

## మామిడి రైతులకు అవగాహన సదస్సు క్రిస్టల్ క్రాప్ ప్రొడక్షన్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో

**కల్లూరు జనవరి 9 (సూర్య న్యూస్)**





మండల పరిధి యజ్ఞ నారాయణపురంలో క్రిస్టల్ క్రాప్ ప్రొడక్షన్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మామిడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మామిడి పూత దశలో రైతులు, యాజమాన్యం పాటించాల్సిన సూచనలు తెలిపారు పూత రాలకుండా నివారించడానికి పొటాషియం నైట్రేట్ వాడాలని తెలిపారు. నివారణకు సరైన మందులు పిసికారి చేయాలని ఎర్ర రేగడి నేలల్లో 10 రోజులకు ఒకసారి, నల్లరేగడి నేలలో 20 రోజులకు ఒకసారి నీటి తడులు ఇవ్వాలని, ఇది పూత నిలిపి నాణ్యమైన దిగుబడి పొందడానికి సహాయపడుతుందని తెలిపారు. నీరు తక్కువగాని ,ఎక్కువగాని పెడితే పూత రాలడానికి కారణం అవుతుందని తెలిపారు. పూత నిలిపేందుకు పూత ఉత్తేజపరిచే ఆడపుష్పాల శాతాన్ని పెంచడానికి పొటాషియం నైట్రేట్ వంటివి వాడాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిఎంఎం రామకృష్ణుడు, ఆర్ బి హెచ్ శ్రీనివాస్ ,ఆర్ ఎం ఎం శివకుమార్, టిఎం రామకృష్ణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ట్రంప్ యుద్ధోన్మాద విధానాలను తక్షణమే మానుకోవాలి..

-అమెరికా సామ్రాజ్యవాదం నశించాలి..

-ఇస్కాఫ్ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి కొలికొండ శరత్ బాబు..

ట్రంప్ విధానాలపై ఖమ్మంలో నిరసన వ్యక్తం చేసిన ఇస్కాఫ్ బాధ్యులు..

ఖమ్మం సూర్య టౌన్ న్యూస్

ప్రజాస్వామ్యంపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తన నీచమైన యుద్ధోన్మాద విధానాలను మానుకోవాలని, లేని పక్షంలో ప్రజలే తగిన బుద్ధి చెప్పడం ఖాయమని ఇస్కాఫ్ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి కొలికొండ శరత్ బాబు హెచ్చరించారు. వెనిజులా దేశంపై యుద్ధ విధానాన్ని నిరసిస్తూ ఇస్కాఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఖమ్మంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శరత్ బాబు మాట్లాడుతూ వెనిజులా దేశ అధ్యక్షుడు, అతని భార్యని అక్రమ అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించాడు. నోబెల్ శాంతి బహుమతి కోరుతున్న ట్రంప్ నిజానికి యుద్ధోన్మాదిగ మారి స్వాతంత్ర దేశాన్ని, సార్వభౌమత్వాన్ని కాలరాసేందుకు ప్రయత్నిస్తున్నాడని విమర్శించారు. దేశాల అంతరంగిక వ్యవహారాల్లో తలదూర్చి వారి వనరులను దోసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికా సామ్రాజ్యవాదం నశించాలి అని అన్నారు. ఆయన పేరుతో చేస్తున్న అక్రమ యుద్ధాన్ని తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రపంచవ్యాప్తంగా




ఆందోళనలకు ప్రజలు సిద్ధమవుతారని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇస్కాఫ్ బాధ్యులు పరిశ పుల్లయ్య, కనపర్తి వెంకటేశ్వర్లు, గుర్రాల శ్రీనివాసరావు, పమ్మి రవి, దాసరి రాము, పాగి వెంకన్న, న్యాయవాదులు లతీఫ్, అమర్ చందు, రవికుమార్, పాల్గొన్నారు.

# హాల్ మార్క్‌కు 15 మంది యస్.బి.ఐ.టి. విద్యార్థుల ఎంపిక

ఖమ్మం సూర్య టౌన్ న్యూస్

భారతదేశం ప్రపంచ దేశాలకు మేధావులను అందించే కర్మాగారం అని యస్.బి.ఐ.టి. కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. ప్రముఖ అంతర్జాతీయ సంస్థ హాల్ మార్క్ శుక్రవారం తమ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఎంపిక పరీక్షలలో తమ విద్యార్థులు అసమాన ప్రతిభను కనబరచి 15 మంది మార్కెటింగ్ ఎక్జిక్యూటివ్ గా ఎంపికవ్వడం తమకు గర్వకారణమని కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణ మాట్లాడుతూ అమెరికా కేంద్రంగా నిర్వహించబడుతూ మన ఖమ్మం ఐ.టి. హబ్ లో సేవలు అందిస్తు వివిధ విభాగాలలో నిష్ణాతులను అందిస్తున్న హాల్ మార్క్ సంస్థలో తమ విద్యార్థులు వారధిగా నిలవటం తమపై మరింత బాధ్యతను పెంచిందని వారు అభిప్రాయపడ్డారు .వివిధ దశలలో నిర్వహించిన ఎంపికల పరీక్షలలో మొదట గ్రూప్ డిస్కషన్లో 134 మంది ఎంపిక అవ్వగా, చివరి హెచ్.ఆర్. రౌండ్లో 15 మంది అర్హత సాధించారని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా. జి. ధాత్రి తెలిపారు. ఎంపికైన విద్యార్థులు 3 నెలల పాటు శిక్షణలో భాగంగా 2.20 లక్షల రూపాయలు అందుకుంటారని, తదనంతరం 3 లక్షల వరకు వార్షిక ఆధాయం పొందుతారని వారు తెలిపారు. ఎంపికైన వారిలో ఎం.బి.ఎ., ఎం.సి.ఎ, బి.టెక్ కు చెందిన వివిధ విభాగాల వారు ఉన్నారని వారు తెలిపారు.ఖమ్మం ఐ.టి. హబ్ లో గత కొన్ని సంవత్సరాలుగా నడపబడుతున్న హాల్ మార్క్ సంస్థ లో తమ కళాశాల విద్యార్థులు









ఎంపిక అవ్వడం, హైదరాబాద్ కు పోటీగా ఎదుగుతున్న ఖమ్మం లో తమ కళాశాల విద్యార్థులు తమకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకోవడం హర్షనీయమని కళాశాల ప్రిన్సిపల్ డా? జి. రాజ్ కుమార్ తెలిపారు. అంతర్జాతీయ సంస్థ అయిన హాల్ మార్క్ తమ కళాశాలను ఎంపిక చేయడం పట్ల హర్షం వ్యక్తం చేసారు. ఎంపికైన విద్యార్థులు ఎం ఎన్ సి సంస్థలకు దీటుగా సేవలను అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేసారు.ఈ కార్యక్రమంలో హాల్ మార్క్ సీనియర్ హెచ్.ఆర్. అల్లూరి ప్రశాంతి, డి. శ్రీనివాస్, కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డా॥ ఎ.వి.వి. శివ ప్రసాద్, టి.పి.ఒ. యన్. సవిత, కోఆర్డినేటర్ డా. జి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత



పెనుబల్లి సూర్య మేజర్ న్యూస్.....

ప్రభుత్వ జూనియర్ కళాశాల పెనుబల్లి ఎన్ ఎస్ఎస్ శీతాకాల శిబి రం పెనుబల్లి మండ లం ఎడ్లబంజర గ్రామ ంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం లో భాగంగా గ్రామంలో పరిసరాలను పరిశుభ్ర పరిచి స్కూల్ ప్రక్కన ఉన్న రోడ్డు ను ఇరువైపుల పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అన్నపూర్ణ, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వారి ఆధ్వర్యంలో మెడికల్ అవేర్నెస్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇందులో డాక్టర్ కిరణ్ కుమార్,డాక్టర్ స్రవంతీ, కళాశాల ప్రిన్సిపాల్ సయ్యద్ యూసఫ్, ఎన్ఎస్ఎస్ పోగ్రామ్స్ ఆఫీసర్ జినుగు రత్నాకర్, అసిస్టెంట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ నాగేశ్వర రావు, సీనియర్ అధ్యాపకులు ప్రవీణ్ కుమార్, తిరుమలయ్య, భాస్కర్ రావు, కసరావు, గ్రామ సర్పంచ్ రాం బాబు, ఉపసర్పంచ్ సుబ్బారావు, పంచయతి సెక్రెటరీ రవి పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల ప్రదేశాలను పరిశీలించిన ట్రైనీ కలెక్టర్ అపూర్వ



పెనుబల్లి సూర్య మేజర్ న్యూస్.....

ట్రైని కలెక్టర్ అపూర్వ పెనుబల్లి మండలంలో శుక్రవారం పర్యటించారు. జాతీయ రహదారులపై తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను హైవే అధికారులతో కలిసి పరిశీలించారు. రోడ్డుపై ఆయా ప్రదేశాలలోనే ప్రమాదాలు జరిగాడానికి గల కారణాలను హైవే అధికారులు అడిగి తెలుసుకున్నారు. ప్రమాద కారణాలను అన్వేషించి వాటి నివారణకు చేపట్టవలసిన చర్యలను వివరించారు. వాహనదారులకు రోడ్డు ప్రమాదాలు జరగకుండా రహదారులపై సూచిక బోర్డులను ఏర్పాటుచేసి వాటిపై అవగాహన కల్పించి విధంగా చర్యలు చేపట్టాలని సూచించినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో హైవే అధికారులు, మండల రెవెన్యూ అధికారులు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతంగాన్ని దెబ్బతీసే విత్తన చట్టం తెచ్చిన కేంద్రం



పెనుబల్లి సూర్య మేజర్ న్యూస్.....

కార్మికులను అనగదొక్కేందుకు లేబర్ కోడ్ చట్టం, రైతాంగాన్ని దెబ్బతీసే విత్తన చట్టాన్ని కేంద్ర బిజెపి ప్రభుత్వం తెచ్చిందని సిఐటియు ఆల్ ఇండియా కోశాధికారి మందడపు సాయి బాబు అన్నారు. శుక్రవారం వి ఎం బంజర్ లోని వంగ నరసింహస్వామి గృహంలో ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ శక్తులను అంటగాగుతున్న మోడీ ప్రభుత్వం దేశ ఆర్థిక అభివృద్ధి కాముకులైన కార్మికులను రైతులను, మరింత అణగదొక్కేందుకు నిరంకుశ చట్టాలను తమకున్న మందబలంతో ఆమోదింప చేసుకుంటున్నారు అన్నారు. బిజెపి అధికారంలో లేనిరాష్ట్రాల పై విద్యుత్తు సంస్కరణల పేరుతో ప్రజలకు రాష్ట్రాలు ఇస్తున్న సబ్సిడీలను ఎత్తివేయించేందుకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసి వ్యవసాయ రంగాన్ని పేద మధ్యతరగతి ప్రజల గృహ వినియోగదారులపై విద్యుత్ భారాలు మోపేందుకు రంగం సిద్ధం చేసిందన్నారు. దేశవ్యాప్తంగా పెట్టుబడిదారులకు, కార్పొరేట్ సంస్థలకు అడవులలో ఉండే ఖనిజాలను వెలికి తీసుకునేందుకు చట్టాన్ని సవరించి వారికి ఉపయోగపడేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. జాతి పేరుతో మతం పేరుతో ప్రజలను విభజించి ఎన్నికల్లో విజయం సాధించడం బిజెపికి పరిపాటిగా మారింది అన్నారు. దేశభక్తి ముసుగులో దేశ ప్రయోజనాలు తాకట్టుపెట్టి లబ్ది పొందినందుకు ప్రభుత్వం సిద్ధమైందన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని అటవీ హక్కుల చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం పూనుకుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి. మధు, సిఐటియు జిల్లా కోశాధికారి చలమాల విటల్ రావు, వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ నాయకులు గాయం తిరుపతిరావు రైతు సంఘం మండల కార్యదర్శి చిట్టి మొదల కృష్ణయ్య పాల్గొన్నారు.

## శ్రీకృష్ణ ప్రసాద్ మెమోరియల్ పోలీస్ సంక్షమ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు

**ఖమ్మం సూర్య టౌన్ న్యూస్**





శ్రీకృష్ణ ప్రసాద్ మెమోరియల్ పోలీస్ సంక్షమ పాఠశాలలో ముందస్తుగా సంక్రాంతి సంబరాలను స్కూల్ చైర్పర్సన్ నిష్టాశర్మ పర్యవేక్షణలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఏఆర్ అడిషనల్ డీసీపీ కుమారస్వామి భోగి మంట వెలిగించి సంబరాలకు శ్రీకారం చుట్టారు. సంప్రదాయ దుస్తులతో విద్యార్థులు అలరించారు. రంగవల్లులు, భోగి మంటల నడుమ అత్యంత ఉత్సాహవంతంగా సంక్రాంతి సంబరాలు జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో ముందుగానే ఈ వేడుకలను నిర్వహించారు.కార్యక్రమంలో ఏ ఆర్ ఏసీపీ నర్సయ్య, ఆర్ ఐ కామరాజు, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రాజు పాల్గొన్నారు.

## సంక్రాంతి సంబరాల త్రివేణి



**ఖమ్మం సూర్య టౌన్ న్యూస్**








ఖమ్మం నగరంలోని త్రివేణి పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రీ ప్రైమరీ విద్యార్థినీ విద్యార్థులకు పాఠశాల అధ్యాపకులు భోగి పళ్ళను పోసి ఆశీర్వదించారు. విద్యార్థినులు చక్కని రంగురంగుల ముగ్గు లు వేసి గొబ్బిళ్ళను పెట్టి గొబ్బి పాటలు పాడారు. విద్యార్థులు రకరకాల వేషధారణలను ధరించి పండగ సంబరాల్లో పాల్గొన్నారు.పాలు పొంగిచ్చి పొంగళ్లను చేశారు. పిల్లల తల్లిదండ్రులలో, పురుషులకు గాలిపటాల తయారీలో మరియు మహిళలకు రంగవల్లుల పోటీ నిర్వహించి విజేతలుగా నిలిచిన తల్లిదండ్రులకు బహుమతి ప్రధానం చేయడం జరిగింది. పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ రైతులకు పంటలన్నీ చేతికొచ్చి చక్కని ఆనందంగా వేడుకలు చేసుకోవడమే సంక్రాంతి అని, సూర్యుడు మకర రాశిలో ప్రవేశించడం ఉత్తరాయణంలోనే జరుగుతుందని ఇది ఎంతో పవిత్రమైన కాలమని అన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు పాఠశాల సిఆర్ఓ కాట్రగడ్డ మురళి కృష్ణ పాఠశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ వైస్ ప్రిన్సిపాల్ స్వప్న,ముస్తఫా, క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్, సందీప్ మరియు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రేపు ఏదులాపురం కాంగ్రెస్ శ్రేణుల కీలక సమావేశం

**ఏదులాపురం :సూర్యా మేజర్ న్యూస్**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఈనెల 10వ తేదీన శనివారం (రేపు) మధ్యాహ్నం 03.00గంటలకు సత్యనారాయణపురంలోని టీసీవీ రెడ్డి ఫంక్షన్ హాల్లో ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 32 వార్డులకు చెందిన అధ్యక్షులు, కార్యదర్శులు, ముఖ్య నాయకులు మరియు నూతనంగా నియమితులైన వార్డు ఇన్-ఛార్జ్ల సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సమావేశంలో అభ్యర్థుల ఎంపిక విధానం, ఎన్నికల వ్యూహాలపై చర్చించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కావున వారందరూ సకాలంలో ఈ సమావేశానికి తప్పక హాజరుకావాలని దయాకర్ రెడ్డి కోరారు.

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే ఐజేయు లక్ష్యం

**-జర్నలిస్టులకు అర్హులైన ప్రతి ఒక్కరికి అక్రిడేషన్ కార్డులు, ఇండ్లు ఇవ్వాలి...**

**-టియుడబ్ల్యూజే రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరు..**

**సింగరేణి సూర్యా మేజర్ న్యూస్**





సింగరేణిటకారేపల్లి జనవరి 9ఉ సింగరేణి మండలంలోని జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే ఐజెయు లక్ష్యమని టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి రామ్ నారాయణ అన్నారు. సింగరేణి మండల కేంద్రమైన కారేపల్లి గంగమ్మ గుడి వద్ద గల కమ్యూనిటీ హాల్ నందు శుక్రవారం టీయూడబ్ల్యూజే మండల మహాసభ జిల్లా ఉపాధ్యక్షులు తాత శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ.. రాష్ట్రంలో టీయూడబ్ల్యూజే కి సంబంధించి మొదటి మండల మహాసభ కారేపల్లి లో నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. యూనియన్ను బలోపేతం చేసేందుకు మండల కమిటీ చేస్తున్న కృషిని అభినందించారు. ఐక్యతతో పెండింగ్ లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు యూనియన్ ఎల్లవేళలా కృషి చేస్తుందన్నారు. జర్నలిస్టులు తమ ప్రధాన సమస్యలను పరిష్కరించుకోవడంలో ఐజెయు ఆధ్వర్యంలో రాజీ లేని పోరాటం కొనసాగిస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్క విలేఖరికి అక్రిడేషన్ కార్డులు,ఇండ్లు ఇవ్వాలన్నారు. అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించడంతో పాటు డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇచ్చేందుకు కృషి చేయాలని కోరారు. టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఏనుగు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నేటి సమాజంలో ఎన్నో సమస్యల పరిష్కారానికి విలేకరులు చేస్తున్న కృషిని కొనిఆడారు. సమాజాభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర కీలకమైంది అన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికీ కొత్త అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలన్నారు. అదేవిధంగా జర్నలిస్టులకుఅన్ని ప్రభుత్వ, కార్పొరేట్ ఆసుపత్రుల్లో చెల్లుబాటు అయ్యేలా హెల్త్ కార్డులు ఇవ్వడంతోపాటు ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్రూమ్ ఇళ్లు కేటాయించాలన్నారు. జర్నలిస్టుల భద్రతకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు శ్రీనివాసరావు,జిల్లా ఉపాధ్యక్షులు తాత శ్రీనివాసరావు చేతుల మీదగా ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే మండల అధ్యక్షులు ఏపూరి లక్ష్మనారాయణ, ప్రధాన కార్యదర్శి కొత్తూరు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు కొండపల్లి వెంకటేశ్వర్లు కోశాధికారి బానోత్ బాలు, సహాయ కార్యదర్శి తేళ్ళ శ్రీనివాసరావు, గూగులోత్ కళ్యాణ్, సురేష్, ముక్కా వెంకటేశ్వర్లు,భయ్యా నాగేశ్వరావు ఆదేర్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదవాలి

**-ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఆంప్లిఫైర్, మౌత్ డొనేషన్**

**కల్లూరు జనవరి9 (సూర్య న్యూస్) :**





విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదివితే ఉన్నతమైన శిఖరాలను అధిరోహించవచ్చునని భద్రాచలం మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ లయన్ సంగం వెంకట పుల్లయ్య అన్నారు. శుక్రవారంతల్లిదండ్రులు జ్ఞాపకార్థంగా సంగం శంభయ్య తిరుపతమ్మ వర్ధంతిని పురస్కరించుకొని కుమారులు మల్లయ్య, కళాశాల పూర్వ విద్యార్థి మోటార్ వెహికిల్స్ ఇన్స్పెక్టర్, భద్రాచలం లయన్ సంగం వెంకట పుల్లయ్య ఆధ్వర్యంలో కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఒక ఆంప్లిఫైర్, మౌత్ ను విరాళంగా అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రేరణాత్మక అవగాహన తరగతి కళాశాల ప్రిన్సిపాల్ షకీలా భాను అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో లయన్ సంగం వెంకట పుల్లయ్య మాట్లాడుతూ విద్యార్థుల జీవితంలో ఇంటర్మీడియట్ విద్య అత్యంత కీలక దశ అని, ప్రస్తుతం పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు ఇష్టంతో, కష్టపడి చదివి ఉన్నత స్థాయిలో ఎదగాలని సూచించారు.తరాలు మారితేనే సమాజం మారుతుందని, మీ తరం సరైన దిశలో ముందుకు సాగితే వచ్చే తరాలు అభివృద్ధి బాటలోకి రావడం ఎంతో సులభమవుతుందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కొత్తగూడెం మిలీనియం సభ్యులు, డిస్ట్రిక్ట్ ఛైర్పర్సన్ లయన్ వెంకట పుల్లయ్య, లయన్ శ్రీ రఘు రామ్ చేతుల మీదుగ ఆంప్లిఫైర్, మౌత్ను కళాశాల ప్రిన్సిపాల్ షకీలా భాను, లెక్చరర్ కె శ్రీనివాస్ కు అందజేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లుకె. శ్రీనివాస రావు, కె. కిరణ్ కుమార్, జె.వి.ఎల్. ప్రసన్న, టి. పుల్లారావు, బి. శ్రీరాములు, జి. జ్యోతి, కలావతి, నాగరాణి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు మార్పిడి

**- మరమ్మత్తులు పర్యవేక్షంచిన సర్పంచ్ వేముకృష్ణ**

**కల్లూరు జనవరి 9 (సూర్య న్యూస్)**



మండల పరిధి లింగాల గ్రామంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను, ఎత్తు తక్కువగా ఉన్న విద్యుత్ స్తంభాలను, మిడిల్ పోల్స్ ను విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం తొలగించి నూతన స్తంభాలను వేయడం జరిగింది. సర్పంచ్ వేము కృష్ణ పర్యవేక్షణలో స్తంభాలు మార్పిడి జరిగింది. గ్రామంలో గృహాలకు విద్యుత్ అంతరాయాలు లేకుండా, విద్యుత్ అధికారులతో సంప్రదించి ఒక్కరోజులోనే స్తంభాలు మార్చటం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సకాలంలో ట్రైయిస్ అన్యూరిజం స్టెంటింగ్ చేసి రోగి ప్రాణాలను కాపాడిన మలక్పేట యశోదా హాస్పిటల్ వైద్యబృందం



**ఖమ్మం, సూర్య (మేజర్ న్యూస్):**
స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హైదరాబాద్ మలకపేట యశోద హాస్పిటల్ కు చెందిన డాక్టర్ సూరిశెట్టి భరత్ కుమార్ ( కన్సల్టెంట్ న్యూరో ఫిజిషియన్ )డాక్టర్ హరి కిషోర్ కామేపల్లి ( కన్సల్టెంట్ న్యూరో ఇంటర్వెంషనల్ రేడియోలోజిస్ట్ ) .శ్రీనివాస్ చీదురా ( అసోసియేటెడ్ వైస్ ప్రెసిడెంట్ ) పాల్గొని మాట్లాడారు . ఖమ్మం ప్రాంతానికి చెందిన 46 సంవత్సరాల మహిళ గత నెల నవంబర్ 7 న తీవ్రమైన తలనొప్పి , వాంతులు , రెండు కళ్లలో మసక చూపు వంటి సమస్యలతో మలకపేట యశోద హాస్పిటల్ కి వచ్చారని,వెంటనే యశోద హాస్పిటల్ బృందం స్పందించి ఆమెకు ఎం ఆర్ ఐ ట్రెయిన్ చేయగా ద్వైపాక్షక సబ్ ఆరాక్నాయిడ్ హేమరేజ్ ఉన్నట్లు తేలిందన్నారు.అత్యంత ప్రమాదకరంగా ఉండటంతో వెంటనే యశోదా ఆసుపత్రికి రిఫర్ చేశారని,ఇక్కడ అత్యవసర పరీక్షలు నిర్వహించగా సిరిట్రల్ ఆంజియోగ్రామ్లో ఎడమ ఏ సి ఏ ఏ 1 సిగ్మెంట్లో చిన్న పరిమాణం , విస్తృతమైన మెడ కలిగిన సాక్యులర్ అన్యూరిజం ఉన్నట్లు నిర్ధారణ అయ్యిందన్నారు.అన్యూరిజం డోమ్ ఇంఫరమెడియల్లీ ఆంటీరియర్లీ వైపు ఉండగా సంబంధిత సెగ్మెంట్లో ఎక్టసినా (డైస్ప్లాసిస్ సూచన) కనిపించిందన్నారు.ఎడమ ఏ సి ఏ ఏ 1 , ఏ 2 సెగ్మెంట్ లో మోడరేట్ వసూస్పాజం ఉన్నప్పటికీ డిస్టల్ పెర్ఫ్యూషన్ సక్రమంగా ఉందనీ రోగికి టైపు 2 డైబెట్స్ మెల్లిటస్ , హైపరటెన్షన్ వంటి సహ వ్యాధులు ఉండటంతో కేసు అత్యంత క్లిష్టంగా పరిగణించబడిందన్నారు. ఈ పరిస్థితి తక్షణ న్యూరో ఇంటర్వెన్షనల్ చికిత్స అవసరమని, అందుబాటులో ఉన్న అత్యాధునిక న్యూరో సర్జరీ సదుపాయాలతో అనుభవజ్ఞులైన వైద్య బృందం తక్షణ అత్యవసర సేవలు అందించి రోగి ప్రాణాలను కాపడగలిగామని అన్నారు . ఇటువంటి అత్యంత క్లిష్టమైన ట్రెయిన్ అన్యూరిజం కేసులను కూడా విజయవంతంగా చికిత్స చేయగలుగుతున్నామని తెలిపారు . అత్యాధునిక అత్యవసర వైద్య సేవలు , ఐసీయూ , ఆధునిక న్యూరో ఇంటర్వెన్షనల్ మౌలిక సదుపాయాలు , న్యూరో ఇమేజింగ్ సాంకేతికత , అనుభవజ్ఞులైన అత్యవసర శస్త్రచికిత్స వైద్య బృందాలు మరియు 24/7 న్యూరో క్రిటికల్ కేర్ సేవలు యశోదా ఆసుపత్తుల అన్ని శాఖల్లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు . అకస్మాత్తుగా వచ్చే తీవ్రమైన తలనొప్పిని చాలాసార్లు సాధారణ సమస్యగా భావిస్తాం . కానీ కొన్ని సందర్భాల్లో అది తలనొప్పి, మెదడులో దాగి ఉన్న ప్రాణాపాయకరమైన సమస్యకు సంకేతంగా ఉంటుంది . అటువంటి అత్యంత ప్రమాదకరమైన పరిస్థితుల్లో ఒకటి ట్రెయిన్ అన్యూరిజం మెదడులోని రక్తనాళం బలహీనమై టెలూన్లా ఉబ్బి , ఎప్పుడైనా పగిలే ప్రమాదం ఉన్న స్థితి . ట్రెయిన్ అన్యూరిజం పగిలినప్పుడు మెదడులో అకస్మాత్తుగా రక్తస్రావం జరుగుతుందన్నారు.ఇది క్షణాల్లోనే స్ట్రోక్, శాశ్వత నర సంబంధిత లోపాలు, కోమా లేదా మరణానికి దారితీయవచ్చు అని అలాంటి పరిస్థితుల్లో ఆలస్యం లేకుండా మెదడు స్కాన్లు చేయడం, ఖచ్చితమైన నిర్ధారణకు రావడం, వెంటనే సరైన శస్త్రచికిత్స చేయడం అత్యంత కీలకమని,ఆమె కేసు పగిలిన భారీ ట్రెయిన్ అన్యూరిజం , మెదడులో అక్యూట్ రక్తస్రావం , అత్యవసర న్యూరో వాస్క్యులర్ పరిస్థితి . క్లిష్టతను దృష్టిలో ఉంచుకుని న్యూరో ఇంటర్వెన్షన్ బృందం అత్యవసర స్టెంటింగ్ చేయాలని నిర్ణయించిందన్నారు. 09/11/2025న జనరల్ అనస్థీషియా ఇచ్చి పూర్తి జాగ్రత్తలతో లియో టీబీ ట్రేడెడ్ స్టెంట్ (3ఇ25 మి.మీ) ను ప్రాక్సిమల్ ఏ 2 నుండి ఏ 1 సిగ్మెంట్ వరకు అమర్చామని, స్టెంట్ అమర్చిన వెంటనే థ్రోంబోసిస్ కనిపించడంతో ఇంట్రా - ఆర్టీరియల్ టిలోఫిటోన్ ఇచ్చి నియంత్రించారన్నారు. ఆంజియోగ్రామ్లలో రక్తప్రవాహం సక్రమంగా పునరుద్ధరించబడి అన్యూరిజం స్థాయి తగ్గి,అత్యవసర సిరిబ్రల్ ఆంజియోగ్రామ్ ట్రైడెడ్ స్టెంట్ (లియో బేబీ 3-25 మీ.మీ) అమరిక , ఇంట్రా ఆర్టీరియెల్ టైరోఫిటన్ ద్వారా థ్రోంబోసిస్ నియంత్రణ , డ్యూయెల్ యాంటి ప్లేట్ లెట్ థెరపీ (యాస్పిరిస్ ం టెకాగ్రిలోర్) , ఐ.సి.యు సబ్జెక్టివ్ కేర్, వెంటిలేటర్ సపోర్ట్, పి.ఆర్.బి.సి ట్రాన్స్ ఫ్యూజన్, యాంటీ పైలెప్టిక్స్ , స్టాటిన్స్ , డయాటెటిక్ వంటివి చికిత్సలో ప్రధానమైన అంశాలు అన్ని అన్నారు . ఇవి అత్యంత క్లిష్టమైన ప్రాణాపాయకరమైన ట్రెయిన్ అన్యూరిజం వంటి న్యూరో వాస్క్యులర్ అత్యవసర పరిస్థితులను కూడా సమర్థవంతంగా నిర్వహించేందుకు సహాయపడుతున్నాయని , నిపుణులైన యశోదా వైద్య బృందం ద్వారా అత్యంత క్లిష్టతరమైన జబ్బులు , వ్యాధులకు కూడా చికిత్స అందుబాటులో ఉంటుందన్నారు .

# ఇచ్చిన మాట నిలబెట్టుకుంటా... ప్రజలకిచ్చిన హామీల అమలులో చంద్రుపట్ల సర్పంచ్

**-సర్పంచ్ కాటమనేని విజయలక్ష్మ, వెంకటేశ్వరావు**



**కల్లూరు, జనవరి 9 (సూర్య న్యూస్)**
గ్రామ సర్పంచ్ ఎలక్షన్స్ లో భాగంగా గ్రామ ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్నానని సర్పంచ్ కాటంనేని విజయలక్ష్మ వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం గ్రామంలో మొదటి హామీ ప్రకారం కొత్తకుంటకు వెళ్ళే డొంక రోడ్డును మరమ్మత్తులు చేయించడం జరిగిందని తెలిపారు. గెలిచిన కొన్ని దినాలలోనే ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంపై గ్రామప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చిన హామీలు ఒక్కొకటిగా నెరవేర్చుకుంటూ గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుపోతానని అన్నారు. గ్రామప్రజలు దోమకాటుకు గురై వ్యాధుల బారినపడకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ప్రజలు సర్పంచ్ కాటమనేని విజయలక్ష్మ వెంకటేశ్వరరావు ను కోరడంతో తక్షణమే స్పందించి గ్రామం లో దోమల మందును స్ప్రే చేయడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ అభివృద్ధికి సహాయ సహకారం అందిస్తామని గ్రామ ప్రజలు తెలిపినారు. ఈ కార్యక్ర మంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాటంనేని వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ పైళ్ల రాధాకృష్ణ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాస్థాయి ఇంగ్లీష్ స్పీచ్ పోటీల్లో రాజుపాలెం జడ్పీహెచ్ఎస్ విద్యార్థి ప్రతిభ





**ఎర్రుపాలెం, సూర్య మేజర్ న్యూస్ :-**
ఖమ్మం జిల్లాస్థాయిలో శుక్రవారం నిర్వహించిన ఇంగ్లీష్ స్పీచ్ పోటీల్లో మండల పరిధి లోని రాజుపాలెంజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఏడవ తరగతి విద్యార్థి విష్ణువ ర్ధన్ ప్రతిభను చాటి ద్వితీయ బహుమతి సాధించాడు.జిల్లా వ్యాప్తంగా వివిధ మండలాల నుండి పాల్గొన్న విద్యార్థుల మధ్య జరిగిన ఈ పోటీల్లోఎస్పీచ్ ఇంగ్లీష్ విభాగంలో విష్ణువర్ధన్ చక్కటి ప్రదర్శన కనపరిచాడని హెచ్ఎం యశోద తెలిపారు.ఈ విజయంలో కీలక పాత్ర పోషించిన ఇంగ్లీష్ ఉపాధ్యాయు రాలు టి రత్తమ్మ ఆధ్వర్యంలో విద్యార్థి నిరంతర శ్రమ ఫలితమే ఈ విజయమని సర్పంచ్ బొగ్గుల గోవర్ధన రెడ్డి,మాజీ సర్పంచ్ లక్ష్మ,మాజీ సొసైటీ అధ్యక్షులు వెన్నపూస కృష్ణారెడ్డి, సుధాకర్ రెడ్డి, వేముల వెంకటే శ్వరరావు, ప్రధానోపాధ్యాయులు యశోద, వ్యాయామ ఉపాధ్యాయులు గోపిరెడ్డి పాఠశాల ఉపాధ్యాయులు విష్ణువర్ధన్ ను అభినందించి, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షంచారు. ఈ విజయం ద్వారా రాజుపాలెం జడ్పీహెచ్ఎస్ విద్యార్థుల ప్రతిభ మరోసారి జిల్లా స్థాయిలో వెలుగులోకి వచ్చిందని సర్పంచ్ గోవర్ధన రెడ్డి అన్నారు.విద్యార్థుల ప్రతిభను చాటేందుకు అన్ని పోటీ పరీక్షల్లో పాల్గొనాలని వారికి కావలసిన ఏర్పాట్లను స్వయంగా తాను అందిస్తానని గోవర్ధన రెడ్డి ఉపాధ్యాయులకు విద్యార్థులకు హామీ ఇచ్చారు.

# అంగన్వాడీ పిల్లలకు యూనిఫాం పంపిణీ



**తిరుమలాయపాలెం, సూర్య మేజర్ న్యూస్:-**
అంగన్వాడీ కేంద్రాల్లో చదువుకునే చిన్నారులకు క్రమశిక్షణ, పాఠశాల వాతావరణంపై అవగాహన కల్పించేందుకు అంగన్వాడీ టీచర్ కృషి చేయాలని అజ్మీర తండా సర్పంచ్ నీలిమ, బాలాజీ అన్నారు. శుక్రవారం అజ్మీర తండా, రాకాసి తండా అంగన్వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిన్న పిల్లలకు కన్నతల్లి తర్వాత అంగన్వాడీ టీచరే తల్లి వంటి వారన్నారు. వారిని ప్రేమగా చూసుకుంటూ ప్రాథమిక విద్యను అందించడంలో టీచర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. పిల్లలు ఆరోగ్యంగా ఎదగాలఅబశ్రీశ్రీని, చిన్నతనం నుంచే బడికి వెళ్లడం అలవాటు చేసుకోవాలనే సదుద్దేశంతో అంగన్వాడీ కేంద్రాలు పని చేస్తున్నఅబశ్రీశ్రీట్లు తెలిపారు. పిల్లల్లో క్రమశిక్షణ, చక్కటి నడవడిక నేర్పించే విషయంలో అంగన్వాడీ టీచర్లు మరింత బాధ్యతగా వ్యవహరిస్తున్నారని కొనియాడారు . ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ సావిత్రి, అజ్మీర తండా అంగన్వాడి టీచర్ రంగనాయకమ్మ, రాకాసి తండా అంగన్వాడి టీచర్ జ్యోతి, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు

# వైరాలోనే ఆర్టీవో కార్యాలయాన్ని కొనసాగించాలి

-ఆర్టీవో కార్యాలయం వద్ద సిపిఎం(ఎం) నిరసన
-బోనకల్‌కు మార్చితే ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం
-సీపీఐ(ఎం) వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం హెచ్చరిక
-అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ జి దినేష్ కు వినతి







వైరా సూర్య ఆర్సి:--
వైరా, సత్తుపల్లి, మధిర నియోజకవర్గాలకు విశేషంగా సేవలు అందిస్తున్న వైరా ఆర్టీవో కార్యాలయాన్ని వైరా నియోజకవర్గ కేంద్రంలోనే కొనసాగించాలని సిపిఐ(ఎం) వైరా డివిజన్ కార్యదర్శి భుక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. వైరా ఆర్టీవో బోనకల్ కు మార్చితే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. శుక్రవారం ఆర్టీవో కార్యాలయాన్ని బోనకల్ కు తరలించడాన్ని వ్యతిరేకిస్తూ ఆర్టీవో కార్యాలయం వద్ద సిపిఐ(ఎం) వైరా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ జి.దినేష్ కు వినతి పత్రాన్ని అందజేశారు . ఈ సందర్భంగా పార్టీ వైరా డివిజన్ కార్యదర్శి భుక్యా వీరభద్రం మాట్లాడుతూ గత 27 సంవత్సరాలుగా వైరా కేంద్రంగా ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండే విధంగా సేవలందిస్తున్న రవాణా శాఖ కార్యాలయాన్ని వైరా నుంచి మధిర నియోజకవర్గం బోనకల్‌కు మార్చాలనే ప్రభుత్వ ఆలోచనను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. వైరాలో ప్రభుత్వ భూమి అందుబాటులో ఉన్నప్పటికీ ఉద్దేశపూర్వకంగా కార్యాలయాన్ని బోనకల్ కు తరలించడాన్ని సిపిఐ(ఎం) పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని అన్నారు. నిర్ణయం వల్ల వైరా, కొణిజర్ల, తల్లాడ, ఏన్కూరు మండలాల ప్రజలకు రవాణా సేవలు అందనంత దూరమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. బోనకల్ మండల కేంద్రంలో ఆర్టీవో కార్యాలయం ప్రారంభించేందుకు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఆదేశాల మేరకు గురువారం బోనకల్ మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయం వెనుక ఉన్న స్థలాన్ని వైరా ఎంవిఐ వరప్రసాద్, తహసిల్దార్ రమాదేవి, యుడిసి ఉపేందర్ పరిశీలించారని తెలిపారు. బోనకల్ కు కొత్త ఆర్టీవో కార్యాలయం మంజూరు చేయాలని సూచించారు. వైరాలో ఉన్న రవాణా శాఖ కార్యాలయాన్ని వైరాలోనే కొనసాగించాలని కోరారు. బోనకల్ కు మార్చడం వల్ల వేలాది మంది ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని, ప్రజల ప్రయోజనాలకు విరుద్ధంగా తీసుకుంటున్న నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని, లేదంటే ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమాలు, ఆందోళన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్, వైరా పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు, రూరల్ కార్యదర్శి బాణాల శ్రీనివాసరావు, డివిజన్ కార్యదర్శివర్గ సభ్యురాలు మచ్చా మణి, నాయకులు గుడిమెట్ల రజిత, పైడిపల్లి సాంబశివరావు, గుడిమెట్ల మోహన్ రావు, కొంగర సుధాకర్, షేక్ నాగుల్ పాషా, తోట కృష్ణవేణి, మందడపు రామారావు, మల్లెంపాటి ప్రసాదరావు, మాడపాటి రామారావు,యనమద్ది రామకృష్ణ, అమరనేని కృష్ణ, పానుగంటి రాంబాబు, మాడపాటి వెంకటేశ్వరరావు, మాడపాటి సుజాత, చావా కళావతి తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు..



వేంసూరు సూర్య మేజర్ న్యూస్
రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం మండల పరిధిలోని మర్లపాడు గ్రామంలో చోటుచేసుకుంది.. వివరాలు ఇలా ఉన్నాయి.. వేంసూర్ గ్రామానికి చెందిన నాగరాజు అనే వ్యక్తికీ మర్లపాడు పెట్రోల్ బంక్ వద్ద కారు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలు అయ్యాయి 108 ద్వారా సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తీసుకెళ్లాలని సూచించడంతో ఖమ్మం తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు

## ఈనెల 11న ఎస్.కె.అంజద్ పాషా కల్చరల్ అసోసియేషన్ ఖమ్మం వారి ఆధ్వర్యంలో

### గాన మాధురి సినీ మధుర గీతాలు



ఖమ్మం సూర్య టౌన్ న్యూస్
రిక్కాబజార్ హైస్కూల్ లో ఈనెల 11న ఎస్.కె.అంజద్ పాషా కల్చరల్ అసోసియేషన్ ఖమ్మం వారి ఆధ్వర్యంలో గాన మాధురి సినీ మధుర గీతాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లునిర్వాహకులు , సీనియర్ గాయకులు అంజాద్ పాషా తెలిపారు . ముఖ్య అతిథి శ్రీ కొమ్మరాజు మాధవరావు "స్వరసుధ " అధ్యక్షులు మరియు మ్యూజిక్ డైరెక్టర్ (మోగా రికార్డ్స్, అఖండ నంది పురస్కార గ్రహీత . సన్మాన గ్రహీత "కళావాచస్పతి" శ్రీ జి.రవీందర్ . కావున సంగీతాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు .

# నేడే ముగ్గుల పోటీలు




వైరా సూర్య ఆర్సి:--
వైరా ఐదవ వార్డులోని సాయి బాబా మందిరం దగ్గర మధ్యాహ్నం రెండు గంటలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఐదవ వార్డు మాజీ కౌన్సిలర్ మాదినేని సునీత తెలిపారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ప్రజలందరికీ నూతన సంవత్సర సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. జాతీయ సమైక్యతను ముడిపెడుతూ మన సాంప్రదాయాలను గౌరవించడం కోసమే ముగ్గుల పోటీలు ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నట్లుసునీత పేర్కొన్నారు మొదటి బహుమతి రెండో బహుమతి మూడో బహుమతి మరియు కన్సోలేషన్ బహుమతులు తో పాటుగా ముగ్గులు వేసిన ప్రతి ఒక్కరికి ప్రోత్సాహక బహుమతులు కలవని ఆమె తెలిపారు. ముగ్గులు రంగులు తదితర అలంకరణ సామాగ్రి పోటీ దారులు తెచ్చుకోవాలని సునీత తెలిపారు. కావున పట్టణ మహిళలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా ఆమె తెలిపారు.

# అంబరానంటిన సంక్రాంతి సంబరాల ముగ్గుల పోటీలు

ఖమ్మం సూర్య టౌన్ న్యూస్
స్థానిక 12.వ డివిజన్ లో ఈరోజు ముగ్గుల పోటీలు అత్యంత ఘనంగా జరిగాయి.ఈ పోటీలో డివిజన్ మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని రంగవల్లులు పోటా పోటీగా వేసారు.ఈ కార్యక్రమంలో నగర మేయర్ శ్రీమతి పునుకొల్లు నీరజ, తుమ్మల యుగంధర్,స్థానిక కార్పొరేటర్లు, చిరుమామిళ్ల లక్ష్మ నాగేశ్వరరావు, సరిపూడి రమాదేవి, కమిటీ సభ్యులు నాగుబండి శ్రవణ్, వెల్లంకి నరేష్, గద్దె మల్లిఖార్జున రావు పాల్గొన్నారు.




## అమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు శ్రీమతి ఏనుగుల మంజుల అకాల మరణం

- ప్రగాఢ సానుభూతి తెలిపిన డా" కడవెండి వేణుగోపాల్ , అన్నం శ్రీనివాసరావు .



ఖమ్మం సూర్య టౌన్ న్యూస్
అమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు శ్రీమతి ఏనుగుల మంజుల అకాల మరణం ఎంతో బాధాకరమని , ఎంతోమంది అనాథ బాలలను చేరదీసి , వారికి అన్నీ తానై ఒక అమ్మలా , నాన్నలా... నేనున్నానంటూ అక్కున చేర్చుకుని వారి ఆలనా , పాలనా , విద్య , ఆరోగ్యం, ఆహారం , ఆవాసం చూస్తున్నటువంటి ఏనుగుల మంజుల అకాల మరణానికి చింతిస్తూ బాధాతప్త హృదయంతో వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని , వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపిన ఎకో క్లబ్ ఎన్విరాన్మెంటల్ సొసైటీ ఫౌండర్ ఉ చైర్మన్ డా" కడవెండి వేణుగోపాల్ , కేశవపట్నం శ్రీనివాస్ మరియు డాక్టర్. అన్నం సేవా ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు పాల్గొన్నారు .